ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

శుక్రవారం 30 ఆగస్టు 2024





బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ శ్రీనివాసరావు

జేఎన్‌టీయూ.. జాప్యం

- సీఎం రాకతో కళాశాల దశ తిరిగేనా?
- ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలో అన్నీ సమస్యలే
- వసతి లేక బోధన సాగక విద్యార్థుల అవస్థలు
- నిర్మాణాల నుంచి నియామకాల వరకూ నిర్లక్ష్యమే
- నేడు కళాశాలలో వనమహోత్సవానికి చంద్రబాబు, పవన్ రాక



జేఎన్‌టీయూ ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థ. ఇలాంటి సంస్థలో సీటు కోసం విద్యార్థులు పోటీ పడతారు. కానీ నరసరావుపేట సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ కాకినాడ కళాశాలలో చేరేందుకు విద్యార్థులు విముఖత చూపుతున్నారు. ఎనిమిదేళ్లుగా కళాశాలలో భవన నిర్మాణాలు ఒక కొలిక్కిరాలేదు. అధ్యాపక నియామకాల్లోనూ జాప్యం చోటుచేసుకుంటుంది. మొత్తంమీద అటు వసతి.. ఇటు బోధన సక్రమంగా సాగక అడ్మిషన్లు పొందిన విద్యార్థులు అల్లాడుతున్నారు. 2016లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు జేఎన్‌టీయూ కేకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఈ కళాశాలను పట్టించుకోలేదు. ఇదే రీతిలో వర్సిటీ పాలకులు కూడా నిర్లక్ష్యం వహిస్తూ వచ్చారు. దీంతో ప్రస్తుతం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల సమస్యల సుడిగుండలో చిక్కుకుంది. గతంలో కళాశాల ఇక్కడ నెలకొల్పేందుకు కృషి చేసి శంకుస్థాపన చేసిన చంద్రబాబు తిరిగి శుక్రవారం ముఖ్యమంత్రి హోదాలో కళాశాలకు రానున్నారు. దీంతో కళాశాల భవితపై చంద్రబాబు దృష్టి సారిస్తారని విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

ఖాళీల వివరాలు ఇలా..

క్యాడర్	ఉండాల్సిన వారు	ఉన్నవారు	ఖాళీ
ప్రొఫెసర్	8	1	7
అసోసియేట్లు	18	2	16
అసిస్టెంట్లు	53	4	49

ప్రాంగణ ఎంపికలు ఇలా..

సంవత్సరం	ఎంపికైన విద్యార్థులు
2021	180
2022	150
2023	110
2024	72

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సా...గుతున్న కళాశాల భవన నిర్మాణాలు. పూర్తికాని భవనాల్లో తరగతులు. 73 మంది అధ్యాపకుల కొరత.. ఇదీ నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల పరిస్థితి. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ సమస్యల సుడిగుండలో చిక్కుకుంది. నరసరావుపేటకు సమీపంలో జేఎన్‌టీయూ కాకినాడ ఇంజనీరింగ్ కళాశాలను 2016లో ఏర్పాటు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కళాశాలకు శంకుస్థాపన చేశారు. కళాశాల భవనాల నిర్మాణానికి జేఎన్‌టీయూ కాకినాడ రూ.90 కోట్లు మంజూరు చేయగా రూ.28 కోట్లతో పరిపాలన, ప్రయోగశాలలు, తరగతి గదుల నిర్మాణాలను చేపట్టారు. ఐదేళ్లుగా కళాశాల భవన నిర్మాణ పనులు సాగదీస్తున్నారు. తరగతులు నిర్వహించేందుకు వీలుగా మాత్రమే పనులు పూర్తి చేశారు. రూ.62 కోట్లతో చేపట్టిన వసతి గృహాల నిర్మాణ పనులు ఏళ్లు గడుస్తున్నా పూర్తికి నోచుకోలేదు. కళాశాల భవనాలు, వసతి గృహాల నిర్మాణాలు పూర్తికాక పోవడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కళాశాలలో ఐదు బ్రాంచ్‌లు ఉండగా వెయ్యి మందికిపైగా విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసిస్తున్నారు. అయితే ఆ స్థాయిలో సౌకర్యాలు, వసతులు, బోధన జరగడంలేదు. పూర్తికాని భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రాంగణంలో వసతి గృహాలు లేక వసతికి విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

అధ్యాపకుల కొరతతో బోధన సక్రమంగా జరగకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కళాశాల తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. నరసరావుపేట నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కళాశాలకు రావడానికి విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు.

అతిథి అధ్యాపకులే దిక్కు

ఇంజనీరంగ్ కళాశాల నిర్వహణపై కాకినాడ జేఎన్‌టీ యూనివర్సిటీ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. కళాశాలను నిర్వీర్యం చేసేలా వర్సిటీ అధికారులు వ్యవహరిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా అధ్యాపకులను నియమించడంలేదన్న విమర్శలున్నాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో వర్సిటీ ఘోరంగా విఫలమవుతోంది. 2018 డిసెంబరులో టీడీపీ ప్రభుత్వం కళాశాలకు 80 అధ్యాపక పోస్టులను మంజూరు చేసి రూ.7.11 కోట్లు వార్షిక బడ్జెట్‌ను కేటాయించింది. అయితే వైసీపీ పాలకులు అధ్యాపకులను నియమించడాన్ని విస్మరించారు. పర్మినెంట్ అధ్యాపకులు ఏడుగురు మాత్రమే కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నది ఒకే ఒక ప్రొఫెసర్ కాగా అది కూడా ప్రిన్సిపాలే. అసోసియేట్ ప్రొఫెసర్లు కేవలం ఇద్దరే ఉండగా ఒకరు క్రీడలకు కేటాయించారు. కనీసం అధ్యాపకులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించే విషయంలోనూ వర్సిటీ అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు.

ఉద్యోగాలను కోల్పోతున్న విద్యార్థులు

అధ్యాపకుల కొరత వెంటాడుతుండటంతో ప్రతిభ కలిగిన విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోంది. అధ్యాపకులు లేకపోవడంతో ఇక్కడ విద్యార్థులు చేరేందుకు ఇష్టపడటంలేదు. దీంతో సీట్లు మిగిలిపోతున్నాయి. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడాల్సిన కళాశాలను వర్సిటీ నిరుపయోగంగా మార్చేస్తోందన్న విమర్శలున్నాయి. ఏటా ఉద్యోగాలు పొందే విద్యార్థుల సంఖ్య పెరగాల్సి ఉండగా ఈ కళాశాలలో దారుణంగా పడిపోతుంది. అయినా అటు ప్రభుత్వం కానీ ఇటు వర్సిటీ పాలకవర్గం కానీ పట్టించు కోవడంలేదు.

చంద్రబాబుపైనే విద్యార్థుల ఆశలు

జేఎన్‌టీయూ కాకినాడ ఎంతో ప్రతిష్ఠాత్మకమైన విద్యాసంస్థ. ఈ కళాశాల తమ ప్రాంతంలో ఉండాలని ప్రజల ఆశ. ఈ విద్యా సంస్థలో చదువుకోవాలనేది విద్యార్థుల కల. అలాంటి విద్యా సంస్థను ఉమ్మడి గుంటూరు జిల్లాకు తీసుకువచ్చిన ఘనత నాటి ముఖ్యమంత్రి చంద్రబాబుది. కాగా నరసరావుపేటలో ఏర్పాటు చేసేలా నాటి అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు చేశారు. 2016లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కళాశాలకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత వైసీపీ హయాంలో కళాశాల నిర్లక్ష్యానికి గురైంది. దీంతో ఎనిమిదేళ్లుగా కళాశాలలో నిర్మాణాల నుంచి అధ్యాపకుల నియామకాల వరకూ జాప్యమే. విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్లలోనూ నష్టపోతున్నారు. ఈ దశలో శుక్రవారం కళాశాల ప్రాంగణంలో జరిగే వనమహోత్సవంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాల్గొనేందుకు రానున్నారు. వీరి పర్యటనతో అయినా కళాశాల దశ మారుతుందని విద్యార్థులు భావిస్తున్నారు. నిర్మాణాల్లో జాప్యాన్ని నివారించి అధ్యాపకులను నియమిస్తారని.. కనీస వసతులు కల్పిస్తారని సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ స్పందించి ప్రకటన చేస్తారని విద్యార్థులు.. వారి తల్లి దండ్రులు ఎంతో ఆశతో ఉన్నారు. వీరి పర్యటనతో కళాశాల సమస్యలు పరిష్కారమైతే విద్యార్థులకు మేలు జరుగుతుందని చెప్పవచ్చు.


నిర్మాణంలో ఉన్న స్పోర్ట్స్ కాంప్లెక్స్


బాలికల వసతి గృహం


బాలుర వసతి గృహం

నేడు.. చంద్రబాబు, పవన్ రాక

- నరసరావుపేట జేఎన్‌టీయూలో వనమహోత్సవం
- మొక్కలు నాటనున్న సీఎం, డిప్యూటీ సీఎం.. భారీగా పోలీసు బందోబస్తు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌కుమార్, జేసీ సూరజ్, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా టీడీపీ, జనసేన అధినేతలైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్‌లు ఒకే వేదికపైకి రానున్నారు. నరసరావుపేట మండలం కాకాని వద్ద ఉన్న జేఎన్‌టీయూ కశాశాల ప్రాంగణంలో శుక్రవారం ఆటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవం జరగనున్నది. ఈ కార్యక్రమంలో సీఎం, డిప్యూటీ సీఎంల హోదాలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు పాల్గొననున్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వేర్వేరుగా రెండు హెలికాప్టర్లలో జేఎన్‌టీయూకు రానున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. చంద్రబాబు, పవన్ మొక్కలు నాటి వనమహోత్సావాన్ని ప్రారంభిస్తారు. అనంతరం జరిగే బహిరంగ సభలో వారు ప్రసంగించనున్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు సభకు హాజరుకానున్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జాయింట్ కలెక్టర్ సూరజ్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు పరిశీలించారు. సభకు హాజరయ్యే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని వారు అధికారులను ఆదేశించారు. బందోబస్తు ఏర్పాట్లపై ఎస్పీ సమీక్షించారు.

ఆర్భాటాలకు దూరంగా సభ

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు హంగు, ఆర్భాటాలు లేకుండా సభకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. ఐదారు వేల లోపు స్థానిక ప్రజానీకం మధ్య వన మహోత్సవం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారన్నారు. భద్రత విషయంలో మాత్రం రాజీ లేదన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

కార్యక్రమం ఇలా..

- ఉదయం 10.10 గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో చంద్రబాబు బయలుదేరుతారు.
- 9.30 గంటలకు మంగళగిరిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి పవన్‌కల్యాణ్ హెలికాప్టర్‌లో బయలుదేరుతారు. జెఎన్‌టీయూ వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 10.15గంటలకు పవన్, 10.30గంటలకు చంద్రబాబు జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు వస్తారు.
- 10.45 గంటలకు కళాశాల ప్రాంగణంలో ఇద్దరూ కలిసి మొక్కలు నాటుతారు.
- అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు.
- 12.45 గంలకు బహిరంగ సభ ముగుస్తుంది.
- 12.50గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుని బయలుదేరి వెళ్తారు.


జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్

మళ్లీ సాగర్ గేట్లెత్తారు

- 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల
- దిగువుకు 3.07 లక్షల క్యూసెక్కులు విడుదల


26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

వీపీ సౌత్, మాచర్ల రూరల్/నరసరావుపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ సాగర్ బంధనాలను తెంచుకుంది. ఈ సీజన్‌లో రెండో సారి నాగార్జున సాగర్ గేట్లు మొత్తం ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. నాగార్జున సాగర్‌కు ఎగువ నుంచి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో సాగర్ జలాశయం క్రస్ట్ గేట్లన్నీ మళ్లీ తెరుచుకున్నాయ్. జలాశయం 26 గేట్లు ఎత్తి నీటిని గురువారం విడుదల చేశారు. ఈ నెలలో గేట్లన్నీ తెరుచుకోవడం ఇది రెండో సారి. క్రస్ట్ గేట్ల నుంచి పాల నురగలా జాలువారుతున్న కృష్ణమ్మ సోయగాలను తనివితీరా చూసేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. డ్యాంకు వస్తున్న నీటిని వస్తున్నట్టుగా దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్‌లో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరుకోవడంతో 26 క్రస్ట్ గేట్లలో 12 గేట్లను 5 అడుగులు, 14 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 3,07,382 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. పూర్తి స్థాయి సామర్థ్యం 312.05 టీఎంసీలకు 312.04 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కుడి కాల్వ ద్వారా 9387, ఎడమ కాల్వ ద్వారా 8280, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,745 క్యూసెక్కులు, 26 క్రస్ట్ గేట్ల ద్వారా 3,07,382, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 600 మొత్తం ఔట్‌ఫ్లో 3,56,194 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 3,56,194 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు పోటెత్తుతున్న వరద

సాగర్ నుంచి పులిచింతల ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. భారీగా వరద వస్తుండటంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి ప్రకాశం బ్యారేజ్‌కు 2,71,983 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పులిచింతలకు 1,64,573 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఈ ప్రవాహం శుక్రవారానికి మూడులక్షల క్యూసెక్కులకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. పులిచింతల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా 42.57 టీఎంసీల నిల్వ ఉంది.

క్రీడలతో మానసిక స్థైర్యం

- క్రీడాదినోత్సవ ర్యాలీలో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, ఆగస్టు 29: క్రీడలతో విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం, మానసిక స్థైర్యం పెరుగుతుందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్ నుంచి ప్రారంభమైన ర్యాలీని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ సాగగా అక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ర్యాలీలో అగ్రభాగాన కలెక్టర్, ఎమ్మెల్యే, డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, ఆర్డీవో గంధం రవీందర్‌లు ఉండగా విద్యార్థులు ముందుకు సాగారు. ముందుగా హాకీ క్రీడాకారుడు దివంగత మేజర్ ధ్యాన్‌చంద్ పటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆరోగ్యంగా ఉండటానికి నిరంతరం వ్యాయామం, క్రీడల్లో పాల్గొంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అంతర్జాతీయ స్థాయిలో ఖోఖో క్రీడలలో బంగారుపతకం సాధించిన శివనాగిరెడ్డి జాతీయ స్థాయిలో ఇత్తడి పథకం సాధించిన కె.రామ్మోహన్, ఎం.ఫణికుమార్, సైక్లింగ్‌లో జాతీయస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పి.అనురాధ రెడ్డిలను సత్కరించి సన్మానించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించటానికి రాష్ట్రప్రభుత్వం వివిధ కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలకు విద్యార్థులు బానిసలు కాకుండా మంచి వైపు అడుగులు వేయాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమే అయినా చిన్నారుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో చీఫ్ కోచ్ కె.పాల్‌కుమార్, డీఈవో నారాయణ, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్, తహసీల్దార్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తదితరులు


బాపట్ల అంబేడ్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, అధికారులు


తీరంలో క్రాక్-2 సందడి

- రామాపురం, వాడరేవు మధ్య హిందీ సినిమా షూటింగ్
- మలినేని గోపీచంద్ దర్శకత్వంలో చేజింగ్ దృశ్యాల చిత్రీకరణ

వేటపాలెం(చీరాల), ఆగస్టు 29: హాలీవుడ్ తీరానికి దిగొచ్చింది. గతంలో రవితేజ హీరోగా రూపొందించిన క్రాక్ సినిమాకు సీక్వెల్‌గా క్రాక్-2గా చిత్రీకరణ వేటపాలెం మండలం రామాపురం, చీరాల మండలం వాడరేవు తీరం వెంట గురువారం జరిగింది. తెలుగులో స్టార్ దర్శకుడిగా గుర్తింపు పొందిన మలినేని గోపిచంద్ దర్శకత్వంలో హీరో సన్నీడియోల్ కథానాయకుడిగా కొన్ని పోరాట సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. నాలుగు రోజులుగా చినగంజాం మండలం మోటుపల్లి పరిసర ప్రాంతాల్లో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ క్రమంలో తాజాగా రామాపురం, వాడరేవు మధ్య ఫైట్ మాస్టర్ హెన్స్‌డెగ్ పర్యవేక్షణలో కార్లు, బైక్‌లతో ఫైటర్లు, హీరో మధ్య జరిగే చేజింగ్ దృశ్యాలను చిత్రీకరించారు. మరో వారం రోజులు పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుగుతుందని చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు. దర్శకుడు మలినేని గోపిచంద్ దర్శకత్వంలో ఈ ప్రాంతంలోనే రవితేజ హీరోగా క్రాక్ సినిమా రూపుదిద్దుకుంది.


షాట్‌ను దర్శకుడికి వివరిస్తున్న ఫైట్ మాస్టర్ హెన్స్‌డెగ్


ఫైటింగ్ సీన్‌కు చేస్తున్న ఏర్పాట్లు



ఆంధ్రజ్యోతి కార్యాలయం వెంగళాయపాలెం గ్రామం, శివశంకరీ దేవాలయం దగ్గర, గుంటూరు రూరల్ (మం) గుంటూరు

గుంటూరు : 99854 03281, 99854 11219, మంగళగిరి : 98484 11050, 99854 03281,
బాపట్ల : 9985411227, 99854 03281, పొన్నూరు : 985411227, 99854 03281,
తెనాలి : 9985411227, 9985402292, 99854 03281, రేపల్లె : 9985411227, 99854 03281,
సత్తెనపల్లి : 99854 77867, 99854 03281, పిడుగురాళ్ళ : 99854 01330, 99854 03281,
మాచర్ల : 99854 01690, 99854 03281, నరసరావుపేట : 99854 11226, 9985401330, 99854 03281,
చిలకలూరిపేట : 99854 11220, 99854 11219, వినుకొండ : 99854 03900, 99854 11219, అమరావతి : 99854 03281

ముంబై నటి కేసులో సమగ్ర విచారణ చేయాలి

పొన్నూరుటౌన్, ఆగస్టు 29: ముంబైకి చెందిన నటి కేసులో సమగ్ర విచారణ జరపాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ గురువారం డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సలహాదారుడి పదవి వెలగపెట్టిన సకల శాఖ మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డితో సహా ఐపీఎస్‌లు అందరూ కలిసి ఒక మహిళపై చేసిన సామూహిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ వ్యవహారం వెనుక ఎవరు ఉన్నారు అనే అంశాలపై నిజ నిర్ధారణ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళకు తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలు ఇప్పుడిప్పుడే ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని వీటిపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.

టీడీపీలో చేరనున్న వైసీపీ కౌన్సిలర్లు

తెనాలి అర్బన్, ఆగస్టు 29: వైసీపీకి చెందిన పలువురు కౌన్సిలర్లు టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఇద్దరు కౌన్సిలర్లు గురువారం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గుంటూరులో ఆయన స్వగృహంలో కలిశారు. 25, 26 వార్డుల కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, షేక్ ఇస్మాయిల్ మాజీ మంత్రిని కలిసి పార్టీలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. వారి బాటలోనే మరి కొందరు కౌన్సిలర్లు టీడీపీలో చేరనున్నట్లు సమాచారం.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సాదియాకు స్వర్ణ పతకం



స్వర్ణ పతకంతో సాదియా అల్‌మాస్

మంగళగిరి సిటీ, ఆగస్టు 29: మంగళగిరికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ షేక్ సాదియా అల్‌మాస్ అంతర్జాతీయ వేదికపై మరోమారు సత్తా చాటింది. మాల్టా దేశంలో ఈ నెల 28 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు జరుగుతున్న ప్రపంచ జూనియర్ మెన్ అండ్ ఉమెన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా 57 కిలోల విభాగంలో సాదియా ఓవరాల్‌గా స్వర్ణ పతకం సాధించింది. స్క్వాట్‌లో 190 కిలోలు, బెంచిప్రెస్‌లో 97.5 కిలోలు, డెడ్ లిఫ్ట్‌లో 175 కిలోలు కలిపి మొత్తం 462.5 కిలోల బరువును ఎత్తి ఈ ఘనతను సాధించినట్టు సాదియా తండ్రి, కోచ్ షేక్ సందాని తెలిపారు. అంతర్జాతీయ వేదికపై మంగళగిరి ఖ్యాతిని మరోమారు ఇనుమడింపజేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కాగా మాల్టా దేశంలో జరుగుతున్న పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక సహకారం అందించాలని సాదియా అల్‌మాస్ మంత్రి నారా లోకేశ్‌కు విన్నవించగా, తక్షణమే స్పందించిన మంత్రి లోకేశ్ ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరిట రూ.3 లక్షల సాయాన్ని అదే రోజు అందజేశారు.

చేనేత సమస్యలపై మంత్రి సవితకు వినతి



మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, ఆగస్టు 29: రాష్ట్రంలో చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు గురువారం తాడేపల్లిలో ఏపీ చేనేత, జౌళి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవితను కలిసి వినతిపత్రం అందజేశారు. చేనేత సమస్యలను మంత్రి సవిత దృష్టికి తీసుకువెళ్లి, నేతన్న సాధకబాధకాలపై చర్చించారు. అనంతరం మంగళగిరిలోని అమరావతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనంద ప్రసాద్ మాట్లాడారు. చేనేత సమస్యలపై మంత్రితో చర్చించామని, బోగస్ చేనేత సహకార సంఘాల ప్రక్షాళనకు పూర్తిగా సహకరిస్తామని తెలియజేశామని చెప్పారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి, ఎన్నికల ద్వారా ఆప్కో చైర్మన్ ఎన్నికను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. చేనేత జీఎస్టీకి రీఎంబర్స్‌మెంట్ అనేది సాంకేతికంగా ఇబ్బందికరమైందని, చేనేత జీఎస్టీకి ప్రత్యేక హెచ్ఎస్ఎన్ కోడ్ ఇవ్వాలని, చేనేతపై జీఎస్టీని పూర్తిగా ఎత్తివేయాలని, చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరినట్టు చెప్పారు. ఆయా సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సవిత హామీ ఇచ్చారని తెలిపారు. వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, వాసా పల్లపురాజు, కూరపాటి కోటేశ్వరరావు, పడవల మోహన త్రినాథ్, పిచ్చుక ఫణికుమార్, రామనాథం పరమేశ్వరరావు, గుర్రం చినవీరయ్య, తాళ్ల మోహనకృష్ణ పాల్గొన్నారు.



ఉద్యోగావకాశాలు

→ ఆఫీసు వర్క్, టెలికాలింగ్, డేటా ఎంట్రీ, ఫిమేల్ స్టాఫ్ కావలెను. Q: డిగ్రీ, జీతం : 15K To 20K మరియు ఆఫీస్ క్లీనింగ్‌కి పని మనిషి కావలెను. జీతం : 10,000 సంప్ర॥ 96406 33359, గుంటూరు.

SPA-5654

→ లిక్కర్ సైట్ బార్ & రెస్టారెంటు నందు పని చేయుటకు వెయిటర్లు కావలెను, Salary : 8,000/-, Duty : 8 Hours, Address: నల్లపాడు రోడ్, Near Bharat Petrol Bank, Cont : 7989315486.

AJG-191830

→ బార్ అండ్ రెస్టారెంట్లో పార్ట్ టైం, ఫుల్ టైం పనిచేయుటకు లిక్కర్ బాయ్స్, హెల్పర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు కావలెను. రూం+భోజనం కలదు. 81431 98968, 95732 71161.

AJL-195739

జ్యోతిష్యాలయం

→ శ్రీలక్ష్మీప్రభ జ్యోతిష్యాలయం వాస్తు, జాతకం, జ్యోతిష్యం, విద్యా, వివాహం, విదేశీ ఉద్యోగం, ఆర్థిక, మానసిక, వ్యాపారం, కోర్టు ఇంటి సమస్యలకు రెమిడీస్ గొర్లె సత్యనారాయణ సిద్ధాంతి, గుంటూరు. ఫోన్ : 98491 68310

AJG-191831

→ గాయత్రి జ్యోతిష్యం : పండిట్ ఎస్.వి.శాస్త్రి గారు 50సం॥లుగా ఆంధ్ర, కర్నాటకలో ప్రసిద్ధి చెందినారు. విద్య, స్త్రీ పురుష ప్రేమ, లగ్నం, సంతానం, వ్యాపార ఆర్థిక కుటుంబ సమస్యలకు సంప్ర. 9440532926.

AJA-198158

అమ్మకము

→ అమరావతి రాజధానికి అతి దగ్గరలో ఉన్న 14వ మైలు To పెదకూరపాడు రోడ్డు "పర్చ" ఊరికి దగ్గరలో (ఎకరం 1.21 సెంట్లు + ఎకరం 1.21 సెంట్లు = ఎకరం 2.42 సెంట్లు) అమ్మకానికి కలదు. విడి విడిగా లేక మొత్తంగా అమ్మబడును. సంప్ర॥ +91 63011 57639, 9989250000.

AJG-191832

రియల్ ఎస్టేట్

→ గుంటూరు జిల్లాలో శ్రీభ్రమరాంబపురం కాలనీ & జనచైతన్య ఫ్లాట్స్ &UDA అప్రూవ్డ్ ఫ్లాట్స్ & పొలములు. అ/కొ. స్పాట్ రిజిస్ట్రేషన్. సంప్ర॥ 9848986831.

SJAA-172

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి



బదిలీల్లో జోక్యం ఉన్నట్లు నిరూపిస్తే రాజీనామా

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



మాట్లాడుతున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, ఆగస్టు 29: ఉద్యోగుల, అధికారుల బదిలీల్లో తన కుటుంబ సభ్యుల జోక్యం ఉన్నట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి, పార్టీకి కూడా రాజీనామా చేస్తానని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గురువారం తన స్వగృహంలో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన వలన పార్టీకి నష్టం జరగడానికి వీల్లేదనీ, ఎమ్మెల్యే పదవిపై కూడా మచ్చ పడటానికి వీల్లేదనీ, ఈ విషయంలో తాను చాలా స్పష్టంగా ఉన్నానని చెప్పారు. తన భార్య జన్మదిన వేడుకల్లో పోలీసులు పాల్గొనడం యాదృచ్ఛికంగా జరిగిన సంఘటన అని చెప్పారు. ఆరోజు చిలకలూరిపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై సమీక్షించడానికి పోలీసులను పిలిచామని తెలిపారు. సీఐలు, ఎస్సైలు వచ్చినప్పుడు మండల పార్టీ నాయకులు కేక్ తీసుకొచ్చారని, ఆ సమయంలో పోలీసులు అక్కడ నిలబడటం యాదృచ్ఛికం తప్ప వారు కావాలని రాలేదని పేర్కొన్నారు. దానిని కూడా తాను సమర్థించడం లేదన్నారు. బదిలీల్లో జోక్యం చేసుకుంటున్నారని, అక్రమ వ్యాపారాలకు కొమ్ము కాస్తున్నారని వచ్చిన ఆరోపణలు బాధను కలిగించాయన్నారు. తన కుటుంబ సభ్యులు కొద్ది నెలలుగా హైదరాబాద్‌లోనే ఉంటున్నారని తెలిపారు. అక్కడ ఉంటున్నవారిపై ఇలా బురద చల్లడం సరికాదని అన్నారు. ఒక వివాహ వేడుకకు హాజరయ్యే నిమిత్తం తన భార్య హైదరాబాదు నుంచి చిలకలూరిపేటకు వచ్చినట్లు తెలిపారు. ఆ మరుసటి రోజే పుట్టినరోజు వచ్చిందని, పుట్టిన రోజు వేడుకలు చేసుకోవడానికి తమ కుటుంబ సభ్యులు ఎప్పుడూ ఇష్టపడరని అన్నారు.

మున్సిపల్ చైర్మన్ రఫాని టీడీపీలో చేరిక

చిలకలూరిపేట, ఆగస్టు 29: వైసీపీకి చెందిన చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని గురువారం టీడీపీలో చేరారు. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు టీడీపీ కండువా కప్పి ప్రత్తిపాటి పార్టీలోకి ఆహ్వానించారు. పట్టణ అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దామని పుల్లారావు ఇచ్చిన పిలుపుమేరకు తాను టీడీపీలో చేరినట్లు రఫాని ప్రకటించారు. వైసీపీ రాజకీయాలు నచ్చటం లేదని, ఓటమి నుంచి ఆ పార్టీ నాయకులు గుణపాఠం నేర్చుకోలేదని చెప్పారు. తప్పుడు ప్రచారాలతో రాజకీయం చేయటమే వారి ఎజెండాగా ఉందన్నారు. పార్టీ సీనియర్ నాయకులు షేక్ కరీముల్లా, టీడీపీ కౌన్సిలర్ గ్రూపు నాయకుడు గంగా శ్రీనివాసరావు, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



రఫానికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రత్తిపాటి

డాక్టర్ కందిమళ్లకు రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం



ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి పురస్కారం అందుకుంటున్న డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు

చిలకలూరిపేట, ఆగస్టు 29: తెలుగు భాషా వికాసానికి నాటక ప్రక్రియ ద్వారా విశేష కృషి చేస్తున్న పట్టణానికి చెందిన డాక్టర్ కందిమళ్ల సాంబశివరావుకు తెలుగు భాషా పురస్కారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ గురువారం ప్రదానం చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన తెలుగు భాషా దినోత్సవంలో చంద్రబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సభకు రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షత వహించారు. ప్రముఖ నాటక రచయితగా, పరిశోధకునిగా గుర్తింపు పొందిన డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు స్థానిక డీఆర్ఎన్ఎస్‌సీవీఎస్ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా, రీడర్ గా, ప్రొఫెసర్‌గా 39 ఏళ్లు పని చేశారు. కందిమళ్ల 17 నాటకాలు, నాటికలను రచించగా అవి పరిషత్తులలో వందలాది బహుమతులు పొందాయి. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి తెలుగు నాటకరంగం నూతన ధోరణులు, ప్రయోగాలు అనే అంశంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పొందారు. బరంపురం విశ్వవిద్యాలయం నుంచి గుంటూరు జిల్లా నాటకరంగ చరిత్రపై పరిశోధన చేసి డీలిట్ పట్టాను పొందారు. భారతీయ నాటక రంగ చరిత్రలో ఈ పట్టాను పొందిన పరిశోధకుడు కందిమళ్ల ఒక్కరే. ప్రకాశం జిల్లా రైతు మాండలికంలో కందిమళ్ల రచించిన సైసై జోడెడ్లబండి నాటకం బంగారు నంది పురస్కారాన్ని పొందింది. తెలుగు నాటక రంగంపై 10 గ్రంథాలను రచించగా రెండు గ్రంథాలకు ఉత్తమ నాటక గ్రంథాలుగా నంది అవార్డులు లభించాయి. తెలుగు భాషా బోధన తో పాటు నాటక రచన పరిశోధన తో భాషా వికాసానికి కందిమళ్ల విశేష కృషి చేస్తున్నారు.

సంస్థాగతంగా బీజేపీని మరింత బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న పురందేశ్వరి, పక్కన బీజేపీ నాయకులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 29: సంస్థాగతంగా బీజేపీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. గురువారం లాలుపురంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కిసాన్ మోర్చా ఇన్చార్జి, జాతీయ కార్యవర్గ సభ్యుడు భారతీ మోహన్, కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్.సురేష్‌రెడ్డితోపాటు ఆమె హాజరైయ్యారు. ఈ సందర్భంగా దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోనూ ఎన్డీఏ ప్రభుత్వం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ బీజేపీకి సానుకూల దృక్పథంతో ఉన్నారని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అత్యధిక సంఖ్యలో ప్రజల నుంచి సభ్యత్వాలు చేర్పించాలన్నారు. వివిధ మోర్చాలు ప్రత్యేకించి కిసాన్ మోర్చా ద్వారా రైతులను పెద్ద ఎత్తున చేర్పించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మట్టా ప్రసాదు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సురేంద్రనాథ్ రెడ్డి, పాకలపాటి రవిబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాండురంగ విఠల్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తుల్లిమిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

భార్యను హత మార్చిన భర్త అరెస్ట్

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 29: భార్యను క్రికెట్ బ్యాట్‌తో కొట్టి హతమార్చిన భర్తను అరెస్ట్ చేసినట్లు ఇన్చార్జి ఈస్ట్ జోన్ డీఎస్పీ బీవీ సుబ్బారావు గురువారం తెలిపారు. పల్నాడు జిల్లా అమరావతి మండలం కర్లపూడి గ్రామానికి చెందిన అచ్చి అంకమ్మరావు అలియాస్ అభిరామ్ 11 ఏళ్ల క్రితం గుంటూరు వచ్చి సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గుంటూరు టౌన్ మణిపురం ప్రాంతానికి చెందిన మాచవరపు చిన్న వెంకటేశ్వర్లు రెండో కుమార్తె మౌనికను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరి వైవాహిక జీవితంలో ఇద్దరు పిల్లలు పుట్టారు. అంకమ్మరావు సెంట్రింగ్ పని చేస్తుండగా, అతని భార్య మౌనిక ఆటోనగర్‌లోని కంపెనీలో పని చేస్తుంది. వ్యసనాలకు బానిసైన అంకమ్మరావు భార్యపై అనుమానంతో ఆమె ఎక్కడ పని చేస్తే అక్కడికి వెళ్లి మగవాళ్లతో అక్రమ సంబంధం అంటగట్టి ఆమెను కొట్టి, తిట్టి, కులం పేరుతో దూషిస్తున్నాడు. ఈ క్రమంలో 26వ తేదీన మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. ఫ్రైడ్ రైస్ తెచ్చి ఆమెను తినమని బలవంతం చేసినా, ఆమె తినలేదు. దీంతో బూతులు తిట్టి ఆమెను గొంతు పట్టుకొని గోడకేసి కొట్టాడు. పక్కనే ఉన్న క్రికెట్ బ్యాట్ తీసుకుని తలపై కొట్టాడు. అనంతరం పారిపోయాడు. మౌనికను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. నిందితుడైన మృతురాలి భర్త అంకమ్మరావును అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చినట్లు డీఎస్పీ సుబ్బారావు చెప్పారు. పాతగుంటూరు సీఐ వై.వి. సోమయ్య, ఎస్ఐ భాగ్యరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రత్తిపాడు, ఆగస్టు 29: జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడి కక్కడే మరణించగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిన కొండ్రుపాడు జాతీయ రహదారిపై హైవే అథారిటీకి చెందిన ట్రాక్టర్ మార్జిన్‌లో పార్క్ చేసి ఉంది. గుంటూరు శ్రీనివాసరావుపేటకు చెందిన కుంచాల అంకమ్మరావుతో పాటు మరో ముగ్గురు కారులో చిలకలూరిపేటలో ఒక ఫంక్షన్‌కు వెళ్తున్నారు. అయితే అతి వేగంగా కారు నడుపుతూ ఆగివున్న ట్రాక్టర్‌ను వెనుక వైపు ఢీకొట్టాడు. ముందు వైపు డ్రైవర్ పక్కనే కూర్చున్న కుంచాల అంకమ్మరావు (35) కారులోనే అక్కడి కక్కడే మరణించాడు. కారు నడుపుతున్న చల్లా శ్రీనివాసరావుతో పాటు లాలం చిరంజీవి, మల్లెల మూర్తికి తీవ్ర గాయాలైయ్యాయి. వీరిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

421 మద్యం సీసాలు స్వాధీనం



పోలీస్‌స్టేషన్‌లో తెలంగాణ మద్యం సీసాలు

మాచవరం, ఆగస్టు 29: తెలంగాణ రాష్ట్రం నుంచి కృష్ణానదిపై నాటు పడవల ద్వారా అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను పట్టుకుని ఐదుగురిని అదుపులోకి తీసుకొని, ఒక కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు మాచవరం ఎస్ఐ కె.సతీష్ గురువారం తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. విశ్వసనీయ సమాచారం మేరకు గోవిందాపురం కృష్ణానది సమీపంలో దాడులు చేయగా తెలంగాణ రాష్ట్రం నుంచి నాటు పడవల ద్వారా కృష్ణానది దాటించి వేర్వేరు ప్రాంతాలకు మద్యం సీసాలను తరలించే పనిలో నిమగ్నమైన తెలంగాణ రాష్ట్రానికి చెందిన బడుగుల నాగరాజు, తొడేటి నరేష్, మాచవరం మండలం శ్రీరుక్మిణీపురం గ్రామానికి చెందిన బత్తుల సత్యనారాయణ, మాచవరంకు చెందిన మహంకాళి వెంకటరావు, మోర్జంపాడు గ్రామానికి చెందిన శ్రీను అనే ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 421 మద్యం సీసాలు, కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మంగళగిరి సిటీ, ఆగస్టు 29: ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళగిరిలో చోటుచేసుకుంది. రైల్వే సీఐ అంజిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 35 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మంగళగిరి రైల్వే స్టేషన్ దాటిన తరువాత కొద్ది దూరంలో విగతజీవుడై పడి ఉన్నాడు. రన్నింగ్ ట్రైన్ నుంచి జారిపడి తీవ్ర గాయాలపాలై మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడు బ్రౌన్ కలర్ టీషర్టు ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించామని చెప్పారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9440627546 నంబరులో సంప్రదించాలని కోరారు.

షెడ్యూల్ కంటే ముందే పరీక్షపై ఫిర్యాదు



ఆచార్య గంగాధరరావుకు ఫిర్యాదు చేస్తున్న ఎన్డీఎస్ఎఫ్ నాయకులు

పెదకాకాని, ఆగస్టు 29: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ విభాగంలో నిబంధనలకు విరుద్ధంగా సెమిస్టర్ ఎగ్జామ్‌ను నిర్వహిస్తున్న డిపార్ట్మెంట్ కో ఆర్డినేటర్ బి.శేఖర్‌బాబును ఎన్డీఎస్ఎఫ్ నాయకులు గురువారం అడ్డుకుని వర్సిటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఫస్ట్ ఇయర్ సప్లిమెంటరీ ఎగ్జామ్‌ను షెడ్యూల్ ప్రకారం 29న మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరపాల్సి ఉండగా, ఎటువంటి కారణం లేకుండా, పైఅధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా నిర్దేశించిన షెడ్యూల్ కంటే ముందు ఉదయం 10 గంటలకే నిర్వహిస్తున్నారు. సంగతి తెలియడంతో ఎన్డీఎస్ఎఫ్ నాయకులు వెళ్లి డిపార్ట్మెంట్ కోఆర్డినేటర్‌ను వివరణ అడుగగా, సరిగా సమాధానం చెప్పకపోవడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో నాయకులు విషయాన్ని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయమని సూచించడంతో విద్యార్థి నాయకులు విషయాన్ని ఇన్చార్జి వైస్ ఛాన్సలర్, రెక్టర్, రిజిస్ట్రార్‌ల వద్దకు తీసుకెళ్లారు. అధికారులు సానుకూలంగా స్పందించి ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని, ఈ విషయంతో పాటు వాటి మీద కూడా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థి ఆందోళనను విరమించారు. ఎన్డీఎస్ఎఫ్ ప్రెసిడెంట్ రత్న సాగర్, సెక్రటరీ గణేష్, వైస్ ప్రెసిడెంట్ రత్న కిషోర్, ట్రెజరర్ మధు పాల్గొన్నారు.

బోగస్ రుణాలపై చర్యలు ప్రారంభం

- సీఎంఎం మేరీ జ్యోత్స్న సస్పెన్షన్
- ఇద్దరు సీవోలు, ఒక ఆర్పీ కూడా సస్పెన్షన్

పొన్నూరుటౌన్, ఆగస్టు 29: బోగస్ గ్రూపులు, అక్రమ రుణాల పేరుతో పొన్నూరు పురపాలక సంఘంలోని మెప్మా విభాగంలో జరిగిన అవకతవకలపై మెప్మా మిషన్ డైరెక్టర్ స్పందిస్తూ ముగ్గురు అధికారులు, ఒక రిసోర్స్ పర్సన్‌ను సస్పెన్షన్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పొన్నూరు పురపాలక సంఘంలోని కమ్యూనిటీ మిషన్ మేనేజర్ ఎం.మేరీ జ్యోత్స్న, కమ్యూనిటీ ఆర్గనైజర్లు వి.ఉషారాణి, పి.జ్యోతి, రిసోర్స్ పర్సన్ నాగ సంధ్యలను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. మెప్మా విభాగంలో వచ్చిన అవినీతి ఆరోపణలపై పీడీ వెంకటేశ్వరరావు విచారణకు ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో పొదుపు సంఘాలు రుణాలు పొందిన బ్యాంక్ నుంచి మరొక బ్యాంక్‌కు మారే వెసులుబాటుకల్పించారు. దీనిని పొన్నూరు పురపాలక సంఘంలోని మెప్మా అధికారులు వైసీపీ నాయకులతో కలిసి బోగస్ గ్రూపుల సృష్టికి అవకాశంగా మలుచుకున్నారు. బ్యాంకుల మధ్య సమన్వయం లేకపోవటంతో ఒక బ్యాంక్‌లో ఉన్న గ్రూపుతోనే మరొక బ్యాంక్‌లో కొత్త గ్రూప్ ఏర్పాటు చేసి బోగస్ రుణాలను పొందారు. ప్రాథమికంగా అందిన ఫిర్యాదుల మేరకు చైతన్య గోదావరి బ్యాంక్‌లోని వైఎస్ మహిళా పొదుపు సంఘం రూ. 10 లక్షలు, బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మదర్‌థెరిస్సా మహిళా పొదుపు సంఘం రూ. 10 లక్షలు, చైతన్య గోదావరి బ్యాంక్‌లో శాంతి మహిళా పొదుపు సంఘం రూ. 10 లక్షలు, దుర్గమ్మ మహిళా పొదుపు సంఘం రూ.7.50 లక్షలు, కెనరా బ్యాంక్‌లో తారా మహిళా పొదుపు సంఘం రూ. 8 లక్షలు రుణాలు పొందారు. ఈ గ్రూపులకు సంబంధించి సభ్యుల వివరాలు, ఆధార్ సీడింగ్‌ను మెప్మా పోర్టల్‌లో నమోదు చేయలేదు. అలాగే ఈ పొదుపు సంఘంలోని మహిళలు మరొక పొదుపు సంఘంలో కూడా సభ్యులుగా ఉండి వేరే బ్యాంక్‌లో రుణాలు పొందిఉన్నారు. సీఎంఎం కానీ, సీవోలు కానీ పొదుపు సంఘం బ్యాంక్ లింకేజ్ ఇచ్చినప్పుడు గ్రూపు వివరాలను, సంఘ కార్యకలాపాలను పుస్తక తీర్మానాలను పరిశీలించాలి. కానీ అధికారులు వీటిని పట్టించుకోలేదు. నిబంధనలకు విరుద్ధంగా ఈ ఐదు గ్రూపుల ద్వారా రూ. 45.50 లక్షలు ప్రజాధనం దుర్వినియోగం అయినట్లు అధికారుల విచారణలో గుర్తించారు. ప్రాథమిక విచారణలో అవకతవకలు రుజువైనట్లు గుర్తించటంతో వారిని వారి విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. ఆర్పీ నాగసంధ్య పేరును మెప్మా లాగిన్ నుంచి తొలగించాలని ఆదేశించారు. అయితే పొన్నూరు పురపాలక సంఘంలో పెద్ద సంఖ్యలో బోగస్ గ్రూపులు ఏర్పాటు చేసి అవినీతికి పాల్పడినట్లు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. సమగ్ర విచారణ జరిపితే మరిన్ని అవకతవకలు బహిర్గతం అవుతాయని పొదుపు మహిళలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కార్యదర్శుల కౌన్సెలింగ్ పూర్తి

గుంటూరు సిటీ, ఆగస్టు 29: పంచాయతీల్లో పని చేస్తున్న కార్యదర్శులకు గురువారం కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి, జడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు మూడు జిల్లాల నుంచి తరలివచ్చిన కార్యదర్శులకు కౌన్సెలింగ్ చేపట్టారు. గ్రేడ్ 5, 6లకు చెందిన 376 మంది కార్యదర్శులకు స్థానచలనం అయినట్లు తెలిసింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

55,261 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 56,735 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 55,261 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 22,347 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	17000	334	8000	15500
నెంబరు. 5	9000	13000	నెంబరు. 5	10000	14000
273	9000	13000	273	11900	12000
341	8000	16000	341	9000	16000
4884	9000	11600	4884	12000	16500
సూపర్ 10	--	–	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18500	తేజ	7500	18500
బ్యాడిగి	8000	15000	బ్యాడిగి	9000	13500
దేవనూరు డీలక్స్	9500	14700	దేవనూరు డీలక్స్	9500	15000
తెల్లకాయలు	4500	11500	తెల్లకాయలు	5000	11000



బహిరంగ ప్రకటన

ICICI Bank

నమోదిత కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్, చక్లీ సర్కిల్ సమీపాన, ఓల్డ్ పద్రా రోడ్, వడోదర - 390007
కార్పొరేట్ కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి - 400051

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

[illegible]

తేదీ: 30.08.2024

సం/- అధీకృత అధికారి, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరపున

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

నడింపల్లి ఉపాధ్యాయుడిపై చర్యలు ఏవీ?

● విచారణ చేపట్టి రెండు వారాలు గడిచినా పట్టించుకోని అధికారులు

● చర్యలు తీసుకోకుంటే రాస్తారోకో చేస్తామంటున్న గ్రామస్థులు

చెరుకుపల్లి, ఆగస్టు 29: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక ఇష్టానుసారంగా నిర్వహించిన నడింపల్లి ఎంపీపీ (హెచ్‌ఈ)పాఠశాల ఉపాధ్యాయుడు మొగలి పువ్వు శ్రీనివాసరావు(ఎంఎస్‌ఆర్)పై ఇటీవల అధికారులు విచారణ నిర్వహించారు. ఈ నెల 8న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికను గుట్టుగా నిర్వహించడంపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై అధికారులు స్పందించి ఈనెల 12న విచారణ నిర్వహించారు. ఇప్పటికి 15రోజులు దాటిన ఉపాధ్యాయుడిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంలో గ్రామస్థులు ఆగ్రహిస్తున్నారు. పాఠశాలలో తన బదులు మరొకరితో పాఠాలు చెప్పిస్తూ ఇస్టానుసారంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోకుంటే పాఠశాల ఎదురుగా నిరసన చేపడతామని విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు. విచారణ మొక్కుబడిగా సాగిందని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. చర్యలు లేకుంటే ఉద్యమిస్తామని తెలిపారు.

జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు వివరణ

విచారణ నివేదికను సిద్ధం చేశాం. దీనిని ఉన్నతాధికారులకు పంపుతున్నాం. అక్కడ నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు.

అగ్ని బాధితులకు టార్పాలిన్ పట్టాల అందజేత



అగ్నిప్రమాద బాధితులకు టార్పాలిన్ పట్టాలను అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ మండల అధ్యక్షుడు ఇనకొల్లు పోలీసురావు, సభ్యులు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 29 : అగ్నిప్రమాదలపై అప్రమత్తంగా ఉండాలని కర్లపాలెం మండల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు ఇనకొల్లు పోలీసురావు అన్నారు. మండలంలోని భవనంవారిపాలెం, చందోలు గ్రామపంచాయతీలలో, వివిధప్రాంతాలలో జరిగిన అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తాత్కాలిక గుడారాలను (టార్పాలిన్ పట్టాలను) అందజేశారు. కార్యక్రమానికి బాపట్ల జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ బీఎస్ నారాయణభట్టు ఆదేశాల మేరకు నిర్వహించినట్లు పోలీసురావు తెలిపారు. ఆపదలో ఉన్నవారికి ప్రభుత్వంతోపాటు అందరూ సహకరించాలని పోలీసురావు కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ మందపాటి పరమానందకుమార్, ఎ.ఆనందరావు, డి.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిబాధితులకు దుస్తుల పంపిణీ

కర్లపాలెం, ఆగస్టు 29 : కర్లపాలెం లంకా ఛానల్‌పై నివాసం ఉంటూ అగ్నిప్రమాదంలో సర్వంకోల్పోయిన అగ్నిబాధితులకు మాజీ ఎంపీటీసీ, తెలుగుదేశంపార్టీ నాయకురాలు కట్టా సుజాత బుధవారం బాధిత కుటుంబాలందరికి నూతన దుస్తులను పంపిణీ చేశారు.

పాఠశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

● రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు, సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు, సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జిట్టా శ్రీనివాసరావు

బాపట్ల, ఆగస్టు 29: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు, సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జిట్టా శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని రైలుపేట ఉప్పరపాలెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు తన సొంత డబ్బులు వెచ్చించి రంగులు వేయించిన శ్రీనివాసరావు గురువారం తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురం వెంకటసాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నారులు చక్కగా చదువుకొని ఉన్నతంగా రాణించి అత్యున్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు. తెలుగుభాష దినోత్సవం, క్రీడాదినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా దాత శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు కోళ్ళపూడి ఉపేంద్రగుప్తా, కార్యదర్శి వి.శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ వైస్‌ఛైర్మన్ నాగప్రసన్న, ఉపాధ్యాయులు షేక్.రఫీ, ఎన్జీవోస్ అసోసియేషన్ కోశాధికారి పానకాల రాయుడు, రోటరీక్లబ్ సీనియర్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కకాటుకు 25 గొర్రె పిల్లల మృతి

● వీధి కుక్కలతో బెంబేలెత్తుతున్న గొర్రెల యజమానులు



కుక్కకాటుకు చనిపోయిన గొర్రెలు

కర్లపాలెం, ఆగస్టు 29 :వీధి కుక్కల దాడిలో 10రోజులుగా 25 గొర్రెపిల్లలు మృతి చెందిన సంఘటన మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో జరిగింది. తుమ్మలపల్లిలో ఎక్కువ మంది గొర్రె పిల్లలను పెంచుతూ జీవనం సాగిస్తున్నారు. 10 రోజులు నుంచి గ్రామంలో 25గొర్రె పిల్లలను కుక్కలు చంపేశాయి. గొర్రెలకాపరులు పెద్ద గొర్రెలను అడవులకు తోలికెళ్ళి చిన్నపిల్లలను పాకల్లో ఉంచటంతో కుక్కలు అధికమయ్యాయి. గ్రామంలో కుక్కల దాడిలో గొర్రెలు చనిపోతున్నాయి. చర్యలు చేపట్టండని అధికారులకు పలుమార్లు చెప్పిన చర్యలు చేపట్టలేదని పట్టించుకోవటంలేదని గొర్రెల పెంపకం దారులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి వీధి కుక్కలను నిర్మూలించాలని గొర్రెకాపరులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సీపీఐ సీనియర్ నాయకుడు సత్యనారాయణ మృతి

రేపల్లె,ఆగస్టు 29: సీపీఐ సీనియర్ నాయకులు బొలిశెట్టి సత్యనారాయణ(73) మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ అన్నారు. బుధవారం అర్ధరాత్రి ఆయన అనారోగ్యంతో మృతి చెందారు. అతడికి భార్య, కుమారులు, కుమార్తె ఉన్నారు. సీపీఐ ఏరియా సంయుక్త సభ్యులుగా గతంలో విధులు నిర్వహించారు. ఆయన మృతదేహానికి ఏఐటీయూసీ నాయకులు పి.నాగాంజనేయులు మృతదేహానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. కుటుంబసభ్యుల కు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ

● ఏడీఏ అక్తర్ హుస్సేన్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ హుస్సేన్

భట్టిప్రోలు(కొల్లూరు), ఆగస్టు 29 : వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాగు పద్ధతులు పాటించాలని ఏడీఏ అక్తర్ హుస్సేన్ పేర్కొన్నారు. గురువారం భట్టిప్రోలు అద్దేపల్లిలో ఆత్మ గుంటూరు వారి సౌజన్యంతో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బాపట్ల ఏడిఏ పాల్గొని మాట్లాడుతూ వ్యవసాయాధికారుల సూచనల మేరకు వరిలో ఎరువులు, పురుగు మందులు వినియోగించుకోవాలన్నారు. మోతాదుకు మించి ఎరువులు వినియోగం వల్ల పంటకు నష్టం చేకూరడంతో పాటు రైతులపై అదనంగా భారం పడుతుందని గ్రహించాలన్నారు. భూసార పరీక్షల అనుగుణంగా వ్యవసాయ అధికారుల సూచనల మేరకు రైతులు ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంపై పొందు రంగారావు ఘన జీవామృతం, ద్రావ జీవామృతం తయియా చేసే విధానం గురించి వివరించారు. భూసార సారాన్ని పెంపొందించడానికి ప్రకృతి వ్యవసాయం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో మీరయ్య, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తెలుగు భాష ప్రాముఖ్యాన్ని తెలుసుకోవాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి



తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని తెలుగుతల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ వెంకటమురళీ, ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, ఆగస్టు 29 : తెలుగుభాష ప్రాముఖ్యతను ప్రజలంతా తెలుసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బాపట్ల తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఫోరం ఫర్‌బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మలు ముఖ్యఅతిథులుగా పాల్గొని తెలుగుతల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. తదుపరి చెరుకుపల్లికి చెందిన కవి రామస్వామిరెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవహారిక భాషలోనే రచనలు ఉండాలని గిడుగు రామ్మూర్తి పంతులు విశేష కృషి చేశారన్నారు. 1863వ సంవత్సరంలో ఆయన చేపట్టిన ఉద్యమంతోనే అన్ని రచనలు తెలుగుభాషలోకి వచ్చాయన్నారు. తెలుగుభాషకు జీవం పోసిన మహోన్నత వ్యక్తిగా రామ్మూర్తి చరిత్రలో నిలిచిపోయారని ప్రశంసించారు. తెలుగుభాష గొప్పతనాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారికంగా తెలుగుభాషా దినోత్సవం జరపాల నడం సంతోషదాయకమన్నారు. చోళుల కాలం నాటి ఆలయాలు బాపట్లలో ఉండటం, బౌద్ధస్థూపాలు, చారిత్రక సంపదను స్పృశిస్తూ బాపట్ల జిల్లాపై ప్రత్యేక గేయాన్ని తయారు చేయాలని కలెక్టర్ తెలిపారు.

తెలుగుభాష ఔన్నత్యాన్ని తెలుసుకోవాలి : ఎమ్మెల్యే వేగేశన

తెలుగుభాష ఔన్నత్యాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. తెలుగుభాషపై ఎంతో మక్కువ ఉన్న మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తెలుగుజాతి కోసం తెలుగుదేశం పార్టీని ఆవిష్కరించారని తెలిపారు. ఫోరం ఫర్ బెటర్ బాపట్ల వారు చేపట్టిన కార్యక్రమాలను అభినందించారు. బాపట్ల పట్టణాభివృద్ధికి ప్రత్యేక కమిటీని నియమిస్తామన్నారు. అనంతరం ఫోరం ప్రతినిధులు కలెక్టర్, ఎమ్మెల్యేలను సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌వో సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో గంధం రవీందర్, ఫోరంఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి పీసీ.సాయిబాబు, తహసిల్దార్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

● సాహితిభారతి ఆధ్వర్యంలో..

బాపట్ల, ఆగస్టు 29: తెలుగు వ్యవహారిక భాష ప్రజాదరణ పొందటానికి ప్రధాన కారకులు, గిడుగు రామ్మూర్తి అని సాహితీభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. గిడుగు రామమూర్తి జయంతి కార్యక్రమం నిర్వహించారు. కోశాధికారి ఆదంషఫీ, ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు, ప్రజాకవి డాక్టర్ శ్రీనివాసర్లు ప్రసంగించారు. అనంతరం రచయితలు శ్రీనివాసరావు, శ్రీరామచంద్రమూర్తి తదితరులు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

కేవీఆర్‌కేవీఆర్ అండ్ ఎమ్‌కేఆర్ డిగ్రీ కళాశాలలో..

పిట్టలవానిపాలెం, ఆగస్టు 29: మండలపరిధిలోని ఖాజీపాలెం కేవీ ఆర్‌కేవీఆర్ అండ్ ఎమ్‌కేఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడాదినోత్స వాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆంగ్లభాష ఆధ్యాపకులు డాక్టర్ నందనవనం శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు. కళాశాల పాలకవర్గం ఆంగ్లభాష అధ్యాపకులు నందనవనం శ్రీనివాసరావుకు కంఠరీవ బిరుదును ప్రదానం చేశారు.

చేనేతల సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, ఆగస్టు 29 : చేనేతల సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. చీరాల మండలం దేవాంగపురి, నిరీక్షణనగర్ గ్రామాల్లోని చేనేతల స్థితిగతులపై అనుబంధశాఖల అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. చేనేత వృత్తిదారులకు అవసరమైన నూలు సరిపడ అందించాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఆర్‌వో సీహెచ్ సత్తిబాబు, జిల్లా చేనేత జౌళి సంక్షేమశాఖాధికారి రాజావర్దన్, ఆర్డీవోలు, ఇతరశాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీలలో వసతులు కల్పించాలి

ఎస్టీకాలనీలలో తాగునీరు, విద్యుత్, రహదార్లు, కాల్వలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. ఆదివాసీ దినోత్సవంలో ఇచ్చిన హామీలపై సంబంధితాధికారులతో గురువారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎస్టీల స్థితిగతులపై సెప్టెంబరు10వ తేదిలోగా సర్వే నిర్వహించాలని చెప్పారు. 2011 నుంచి ఆధార్‌కార్డులు పంపిణీ జరుగుతున్నప్పటికి ఎస్టీలకు నేటికి కార్డులు అందకపోవటం బాధాకరమన్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే ఆధార్‌కార్డులు ఇంతవరకు అందుకోలేకపోయారన్నారు. వారికి అవసరమైన జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో సత్తిబాబు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి ధూర్జటి ఆర్డీవోలు గంధం రవీందర్, హేలా షారోను, అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.

తల్లిపేరుతో ఒక మొక్క నాటండి

తల్లి పేరుతో ఒక మొక్క అనే నినాదంతో విస్తృతంగా మొక్కలు నాటాలని కలెక్టర్ తెలిపారు. కేంద్రప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో మొక్క నాటి నీరు పోశారు. అందరు తమ తల్లి పేరుతో ఒక మొక్క నాటాలని ఆయన పిలుపునిచ్చారు.

బాపట్ల జిల్లాలో 20లక్షల మొక్కలు నాటాలి

బాపట్లజిల్లాను పచ్చగా చేయాలని ఇందు కోసం 20లక్షల మొక్కలు నాటాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. వనమహోత్సవంపై సంబంధితశాఖల అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ హరితాంధ్రప్రదేశ్ లక్ష్యంగా మొక్కలు నాటాలని చెప్పారు. ఈనెల 30వ తేదిన వన మహోత్సవం జిల్లాలో లాంఛనంగా ప్రారంభిస్తున్నామన్నారు. సూర్యలంక ప్రాంతంలోని అటవీభూములలో మొక్కలు నాటి కార్యక్రమానికి శ్రీకారం చుడుతామన్నారు. సమావేశంలో అటవీశాఖ రేంజ్ అధికారి బివి.రమణరావు, గృహనిర్మాణశాఖ పీడీ ప్రసాద్, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను సన్మానించిన గిరిజన నాయకులు

జిల్లా గిరిజన నాయకులు గురువారం కలెక్టర్ జె.వెంకటమురళిని సన్మానించారు. ఎస్టీల అభివృద్ధి గిరిజనులతోనే సాధ్యమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. గిరిజన కాలనీలలో కనీస వసతులు కల్పించి ప్రతి ఒక్కరికి ఆధార్‌కార్డులు ఇప్పించాలని ఆదేశాలు జారీ చేయటంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు తిరువీధుల శంకరప్రసాద్, మోహన్‌కుమార్ ధర్మా, చిన్నపోతుల హరిబాబు, కట్టా సుజాత, కోనేటి వెంకయ్య తదితరులు ఉన్నారు.

బీజేపీ రాకతో ఏపీలో వైసీపీ ఖాళీ : మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల, ఆగస్టు 29: బీజేపీ రాకతో ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ఖాళీ అవుతుందని మాజీ ఎమ్మెల్సీ బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ స్పష్టం చేశారు. పార్టీశ్రేణులతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అన్నం సతీష్ మాట్లాడుతూ వైసీపీ కులం, డబ్బు మీద పరిపాలన చేసిందన్నారు. వైసీపీ పూర్తిగా ఖాళీ అవడం తథ్యమన్నారు. ప్రజలకు సేవ చేయాలనుకున్న వైసీపీ నాయకులను బీజేపీ సాదరంగా ఆహ్వానం పలుకుతుందన్నారు. వారధి అనే కార్యక్రమానికి బీజేపీ శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకోవటానికి పార్టీశ్రేణులు అందుబాటులో ఉంటారన్నారు. సెప్టెంబరు 1వ తేదీ నుంచి బీజేపీ సభ్యత్వం కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ప్రతి ఒక్కరు సభ్యత్వం తీసుకోవాలని ఆయన కోరారు. ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో ప్రధానీ నరేంద్రమోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల ఫొటోలు ఉండేవిధంగా చూడాలన్నారు. రాష్ట్రంలో 10 సంవత్సరాలపాటు నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా కొనసాగితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పవన్ కల్యాణ్ ప్రకటించినట్లు తెలిపారు. కూటమి పాలనలో అవినీతికి తావులేదన్నారు. అధికారులు అవినీతికి పాల్పడితే సహించేదిలేదన్నారు. అవినీతి అధికారులపై వారధి కార్యక్రమంలో ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు చేసే వారిపేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. వైసీపీ పాలనలో పోలీసు వ్యవస్థను నాశనం చేసి కార్యకర్తల్లాగా వాడుకున్నారని విమర్శించారు. గృహ నిర్మాణాలు కొరకు దరఖాస్తు చేసుకునే ప్రతి ఒక్కరికి అధికారులు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, అసెంబ్లీ కన్వీనర్ మణియాదవ్, పట్టణాధ్యక్షులు మామిడి రమేష్‌కుమార్, యువమోర్చా రాష్ట్ర కోశాధికారి బి.కృష్ణ చైతన్య, పేరలి సునీల్, కొండారెడ్డి అనీల్‌కుమార్, కొత్రా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీ కుబేర హోమార్చన



హోమార్చాన కార్యక్రమంలో భాగంగా పూజలు చేస్తున్న పండితులు

బాపట్ల, ఆగస్టు 29: పట్టణంలోని చీలురోడ్డు సెంటర్లో ఉన్న శ్రీపాండురంగస్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రావణమాసం సందర్భంగా గురువారం అజ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీఅష్టలక్ష్మీదేవికి పంచామృతాభిషేకం, పసుపుకొమ్ములు, కుబేర కుంకుమార్చన, తామర పూలు అన్ని రకాల పూలతో అర్చన చేశారు. శ్రీలక్ష్మీ కుబేర హోమార్చన అనంతరం 18 రకాల నైవేద్యాలు, హారతులు ఇచ్చి తీర్థప్రసాద వినియోగం చేశారు. పూజా కార్యక్రమంలో శ్రీలలిత త్రిపురసుందరి పీఠం నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు పర్యవేక్షణలో అర్చకులు యాజ్ఞీకం నిర్వహించారు. దేవదాయధర్మకర్త మార్పూరి నారాయణ, వక్కలగడ్డ శ్రీనివాసరావు, శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జన సైనికుల సమావేశం

కొల్లూరు, ఆగస్టు 29 : జనసేన పార్టీ నాయకులు తమ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గురువారం కొల్లూరులోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మండల అధ్యక్షుడు బొందలపాటి చలమయ్య మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని జనసైనికులు నిర్వహించాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. సమావేశంలో జనసైనికులు ఆర్ పాండురంగారావు, ఈమని మణికంఠ, పవన్, సమ్మెట దుర్గాప్రసాద్, తూము నవీన్, తాడిశెట్టి బాలాజీ, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ.. అపరాధ రుసుం రూ.7,136

బాపట్లరూరల్, ఆగస్టు 29 : బాపట్ల మండలంలో ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు బాపట్ల రూరల్ సీఐ కె.గంగాధరరావు వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ వాహనాల తనిఖీ కార్యక్రమంలో సరైన ధ్రువీకరణపత్రాలు లేని వాహనాలకు రూ.7,136లు ఈ చలనాలో అపరాధ రుసుంను విధించారన్నారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశాల్లో మందు తాగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారికి కూడా అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మందు తాగితే చట్టపరమైన కఠినచర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ గంగాధరరావు హెచ్చరించారు.

దాడి ఘటనలో నిందితుడికి ఏడాది జైలు

వేమూరు, ఆగస్టు 29 : కత్తితో దాడి చేసి గాయపరచిన కేసులో నిందితుడికి కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. చావలి గ్రామానికి చెందిన సోమరౌతు కోటయ్య, సింధు జయేంద్రప్రసాద్, స్నేహితులు, మరియు దూరపు బంధువులు. ప్రసాద్ తన అవసరాల కోసం కోటయ్యను డబ్బులు అడిగి తీసుకుని తిరిగి ఇవ్వకపోవడంతో గత ఏడాది డిసెంబర్ 18న ఘర్షణ పడ్డారు. కోటయ్యను ప్రసాద్ కత్తితో పొడిచి గాయపరచగా పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం గురువారం జడ్జి శ్రీధర్ తీర్పు చెప్పారు.

ఎడ్లబండిని ఢీకొన్న లారీ.. ఎద్దు మృతి

బాపట్లరూరల్, ఆగస్టు 29 : ఎడ్లబండిని లారీ ఢీకొన్న ఘటనలో ఎద్దు మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే బాపట్ల మండలం బేతపూడి గ్రామానికి చెందిన సాంబిరెడ్డి అనే రైతు తన ఎడ్లబండిపై బాపట్ల నుంచి చీరాల వైపుకు వెళుతుండగా కొత్త కంకటపాలెం గ్రామసమీపంలోని రహదారిపై ఎడ్లబండిని వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రైతుకు చెందిన ఎడ్లబండి పూర్తి స్థాయిలో ధ్వంసమవడంతోపాటు ఓ ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై రైతు వెదుళ్ళపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జ్వర పీడితులకు ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

● డీఎంహెచ్‌వో విజయమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో విజయమ్మ

కొల్లూరు, ఆగస్టు 29: గ్రామాల్లో జ్వర పీడితులకు ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని డీఎంహెచ్‌వో ఎస్ విజయమ్మ సూచించారు. గురువారం కొల్లూరులోని వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించి రోగులతో మాట్లాడి వైద్య కేంద్రంలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని, గ్రామాల్లో ఉన్న రోగులు ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తు న్నారన్నారు. రోగులు ప్రథమ చికిత్స చేసిన అనంతరం దగ్గరలో ఉన్న ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి వెళ్ళి తగిన వైద్యం చేయించుకోవాలని రోగులకు ఆర్‌ఎంపీలు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో జ్వర పీడితులు ఉంటే వెంటనే దగ్గరలో ఉన్న ఆశ, ఏఎన్‌ఎంలను సంప్రదించాలని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు సంధ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 99854 11227 99854 02292

ఉదయం 5 నుంచే పింఛన్లు పంపిణీ చేయాలి

● జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ బి.సుబ్బారావు

బాపట్ల, ఆగస్టు 29: సెప్టెంబరు నెల పెన్షన్‌లు ఈనెల 31వ తేదీ ఉదయం 5గంటలకే ప్రారంభించి నూరుశాతం పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ బీ సుబ్బారావు తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జేసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 1వ తేది ఆదివారం వచ్చింది కాబట్టి ముందుగానే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పంపిణీ కార్యక్రమంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. అధికారులంతా ప్రణాళికాబద్ధంగా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. అధికారులంతా క్లస్టర్ పరిధిలోని వారందరికీ సమాచారం ఇవ్వాలన్నారు. అన్ని జాగ్రత్తలు తీసుకొని పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అమృతలూరు, ఆగస్టు 29 : సెప్టెంబరు 1వ తేదీన ఆదివారం కావడంతో 31వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు పెన్షన్‌లు పంపిణీ చేయాలని ఆదేశించినట్లు ఎంపీడీవో మహబూబ్ సుభానీ చెప్పారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల పరిధిలో 7540 మంది లబ్ధిదారులకు 3 కోట్ల 81 లక్షల 95వేల రూపాయలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండల కార్యాలయంలో ఇందు కోసం ఆరుగురు సిబ్బంది పర్యవేక్షించనున్నట్లు తెలిపారు.

జడ్పీ పాఠశాలలో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవం



జాతీయ క్రీడా దినోత్సవంలో పాల్గొని మాట్లాడుతున్న టీడీపీ నేత మైనేని మురళీకృష్ణ

కొల్లూరు, ఆగస్టు 29 : తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం మండల కేంద్రం కొల్లూరులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ పాల్గొని మాట్లాడుతూ తెలుగు బాష మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. విశ్వవిఖ్యాత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా విద్యాకమిటీ ఛైర్మన్ తులామాన్, వైస్ ఛైర్మన్లను దుశ్శాలువా, పూలమాలలతో ఆయనను సత్కరించారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.నాగపాప, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భట్టిప్రోలు మండలంలో..

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 29 : తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మండలపరిధిలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాసరచన, రామాయణం, పాటలు, క్విజ్ తదితర పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయిని కె.అరుణకుమారి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీమోహన్, రెడ్డి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేమూరు మండలంలో..

వేమూరు, ఆగస్టు 29 : వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి పలూమాల వేసి నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయయులు శ్రీలక్ష్మీ, విజయలక్ష్మీలను సత్కరించారు. విద్యార్థులు తెలుగు భాషకు చెందిన అనేక గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో సహ ఉపాధ్యాయులు, పాఠశాలల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అంతర్జాతీయ క్రీడా దినోత్సవం

వేమూరు, ఆగస్టు 29 : మండలంలోని ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం అంతర్జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఎంఈవో రోజ్‌ల్యాండ్ వేమూరులో క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమన్నారు. విద్య ద్వారా విజ్ఞానాన్ని పొందగలుగుతాం, అంతే కాకుండా క్రీడల్లో రాణించిన వారిని ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్ పొందే అవకాశం ఉంటుందన్నారు. అంతర్జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులంతా క్రీడలపై కూడా ఆసక్తి చూపే విధంగా ప్రతిజ్ఞ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె మున్సిపల్ కమిషనర్‌గా సాంబశివరావు

రేపల్లె, ఆగస్టు 29: రేపల్లె మున్సిపల్ కమిషనర్‌గా సాంబశివరావును నియమించినట్టు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఆయన గుంటూరు మున్సిపల్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బదిలీపై రేపల్లె మున్సిపల్ కార్యాలయానికి కమిషనర్‌గా రానున్నారు. రేపల్లె కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న శేషాద్రి గుంటూరు డీఎంఎ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థులు విద్యతో పాటు క్రీడారంగంలో రాణించాలి



జాతీయ క్రీడా దినోత్సవ సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవిచంద్రకుమార్

రేపల్లె, ఆగస్టు 29: విద్యలో రాణిస్తూ క్రీడారంగంలో ప్రతి ఒక్కరూ మక్కువ చూపి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రిన్సిపాల్ టీసీ రవిచంద్రకుమార్ అన్నారు. గురువారం స్థానిక ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.బుజ్జిబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు వాలీబాల్, టెన్నికాయిడ్, షటిల్ బ్యాడ్మింటన్, పరుగుపందాలు నిర్వహించారు. విద్యార్థులు క్రీడారంగంలో రాణిస్తే శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెంపొందించుకోవచ్చని సూచించారు. క్రీడల్లో రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో రాయితీలను పొందవచ్చని విద్యార్థులకు సూచించారు. అనంతరం గెలుపుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

మాతృభాషా పరిరక్షణకు కృషి చేయాలి

రేపల్లె, ఆగస్టు 29: మాతృభాషా పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని డాక్టర్ నందనవ నం శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక అనగాని భగవంతరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాతృభాషా దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపాల్ రవిశంకర్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవహారిక భాష కోసం గిడుగు రామమూర్తి పంతులు చేసిన సేవలను కొనియాడారు. భాష అంతరించి పోకుండా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత జాతిపై ఉందని సంస్కృతి చరిత్రను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రభుత్వాలు కూడా తెలుగు భాష అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నరసయ్య, వైస్ ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, పి.దాసు, సత్తార్, తెలుగు డిపార్టుమెంట్ ఇన్‌చార్జ్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శుక్రవారం • 30 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com



రజనీకాంత్ చిత్రంలో నాగార్జున

రజనీకాంత్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న 'కూలీ' చిత్రంలో అక్కినేని నాగార్జున కీలకపాత్ర పోషిస్తున్నారు. గురువారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా చిత్ర బృందం ఈ విషయాన్ని ప్రకటించింది. ఇందులో ఆయన పోషిస్తున్న సైమన్ పాత్రను పరిచయం చేస్తూ యూనిట్ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో కళానిధి మారన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అలాగే నాగార్జున కీలకపాత్ర పోషిస్తున్న మరో చిత్రం 'కుబేర' నుంచి ఆయన స్టైలిష్ లుక్‌ను విడుదల చేశారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

మగవాళ్లనూ వదల్లేదు

• దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై తాజా ఆరోపణ

మాలీవుడ్‌లో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదిక పరిశ్రమను కుదిపేస్తోంది. తాజాగా మరి కొందరు మలయాళ సినీ ప్రముఖులపై అత్యాచారం కేసులు నమోదయ్యాయి. నటి మిను మునీర్ ఆరోపణలతో బుధవారం నటుడు, సీపీఎం ఎమ్మెల్యే ముఖేశ్, హీరో జయసూర్యపై అత్యాచారం కేసు నమోదు చేశారు. వీరితో పాటు మరో ఐదుగురిపైనా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీంతో ఇప్పటివరకూ 17 మందిపై కేసులు నమోదయ్యాయి.

అవకాశం ఇస్తానని...

మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ తనను లైంగికంగా వేధించాడని బెంగాలీ నటి శ్రీలేఖ మిత్ర ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే అతను ఆడవాళ్లనే కాదు మగవాళ్లనూ వదల్లేదు అని కోజికోడ్‌కు చెందిన నజీర్ అనే వ్యక్తి సంచలన ఆరోపణలు చేశాడు. తనపైన 2012లో రంజిత్ లైంగిక దాడికి పాల్పడ్డాడు అని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు నజీర్ కేరళ డీజీపీకి ఫిర్యాదు చేశాడు. "సినిమా అవకాశం ఇస్తానని చెప్పి బెంగళూరులోని తాజ్ హోటల్‌కు అర్ధరాత్రి పిలిపించుకున్నాడు. గదిలోకి వెళ్లాక నా దుస్తులు తొలగించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. నా ఫొటోలు తీశాడు. 'వాటిని ఎవరికి పంపావు' అని అడిగితే 'లోపలి గదిలో నటి రేవతి ఉన్నారని రంజిత్ నాతో చెప్పాడు. అయితే ఆమె నిజంగా అక్కడ ఉన్నారా? లేదా, వారిద్దరి మధ్య ఎలాంటి సంబంధం ఉందనేది నాకు తెలియదు' అని నజీర్ చెప్పాడు.

పృథ్వీరాజ్ తగిన వ్యక్తి

అమ్మ (అసోసియేషన్ ఆఫ్ మలయాళ మూవీ ఆర్టిస్ట్స్) అధ్యక్ష పదవికి మోహన్‌లాల్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో బాధ్యతలు నిర్వహించేందుకు హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ తగిన వ్యక్తి అని నటి మిను మునీర్, పార్వతి తిరువోతు అభిప్రాయపడ్డారు. అమ్మ ఎగ్జిక్యూటివ్ ప్యానెల్ మూకుమ్మడి రాజీనామాపై నటి పార్వతి తిరువోతు స్పందించారు. అసోసియేషన్‌లో నిరంకుశ పాలన నడుస్తోందని ఆరోపించారు. మీడియా ముందుకొచ్చి మాట్లాడే అవకాశం లేకపోవడంతోనే రాజీనామా చేశామన్నారు. తమ నిర్ణయం పిరికితనంగా అనిపించిందన్నారు. ఇంతమంది మహిళలు ధైర్యంగా బయటకొచ్చి ఫిర్యాదు చేస్తున్నా కేరళ ప్రభుత్వం విచారణలో నిర్లక్ష్యం చూపుతోందని మిను ఆరోపించారు.

కోలీవుడ్‌లోనూ కమిటీ

'అడ్జెస్ట్‌మెంట్' పేరుతో సినిమా అవకాశాలు ఇస్తామని గాలం వేసేవారు ఎంతటివారైనా చెప్పుతో కొట్టాలని 'నడిగర్ సంఘం' ప్రధాన కార్యదర్శి హీరో విశాల్ పిలుపునిచ్చారు. జస్టిస్ హేమ కమిషన్ తరహాలోనే కోలీవుడ్‌లోనూ నడిగర్ సంఘం ఆధ్వర్యంలో పది మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తాం అని చెప్పారు.



హేమ కమిటీకి సమంత ప్రశంసలు

మలయాళ చిత్రపరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలికితేవడంలో హేమ కమిటీ పనితీరు అద్భుతంగా ఉందని టాలీవుడ్ కథానాయిక సమంత ప్రశంసించారు. అలాగే ఈ కమిటీ ఏర్పాటుకు కారణమైన డబ్ల్యూసీసీ (ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్) సంస్థనూ ఆమె అభినందించారు. ఆ సంస్థ సభ్యుల కష్టం వల్లే ఈ రోజు మహిళల సమస్యలు చర్చనీయాంశంగా మారాయని చెప్పారు. సినీ పరిశ్రమలో మహిళల సంరక్షణ కోసం ఆ సంస్థ అవిశ్రాంతంగా పాటుపడుతోందని అభినందించారు. 'డబ్ల్యూసీసీ గురించి నాకు చాలా కాలంగా తెలుసు. ప్రభుత్వం హేమ కమిటీ ఏర్పాటు చేయడానికి ఆ సంస్థ తీసుకొన్న చొరవే కారణం. వారి పోరాటానికి నా కృతజ్ఞతలు' అన్నారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/6tDC2Mxలో చదవండి.

నవరస నటనకు యాభై ఏళ్లు!

ఎన్టీఆర్ వంటి మహా నటుడికి వారసుడు కావడం ఒక విధంగా బాలకృష్ణ అదృష్టం, మరో రకంగా అగ్నిపరీక్ష కూడా. తండ్రి పేరు నిలబెట్టి ఆ విషయంలో విజయం సాధించారు బాలకృష్ణ. యాభై ఏళ్లక్రితం సరిగ్గా ఇదే రోజున విడుదలైన 'తాతమ్మ కల'(1974 ఆగస్టు 30) చిత్రంతో చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టారు. సాధారణంగా 30 ఏళ్లో, నలభై ఏళ్ల కాలమో కథానాయకుడిగా నటించి, ఆ తర్వాత క్యారెక్టర్ పాత్రలకు షిఫ్ట్ అయిన నటులు ఎందరో! కానీ బాలకృష్ణ విషయం చాలా ప్రత్యేకం. తొలి సినిమా 'తాతమ్మ కల' నుంచి ఇప్పటి వరకూ ఒక్క ఏడాది కూడా గ్యాప్ తీసుకోకుండా హీరోగానే నటిస్తూ యాభై ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకుని చరిత్ర సృష్టించారు బాలకృష్ణ. సెప్టెంబర్ ఒకటిన దక్షిణాది చిత్ర పరిశ్రమలోని అతిరథ మహారథుల సమక్షంలో ఆయనకు భారీ సన్మానం జరుగుతున్న నేపథ్యంలో ఆయన కెరీర్‌లో మలుపులు, మెరుపులు....

ప్రపంచ వ్యాప్తంగా ఎందరో నటీనటులు తమ వారసుల్ని వెండితెరకు పరిచయం చేశారు. ఆ సంప్రదాయాన్ని మన దేశంలో మహా నటుడు పృథ్వీరాజ్ కపూర్ అనుసరించారు. ఆయన తనయులు రాజ్ కపూర్, షమ్మీ కపూర్, శశి కపూర్ తండ్రి లాగానే నటనను వృత్తిగా స్వీకరించి తమదైన బాణీ పలికించారు. రాజ్ కపూర్ కూడా తండ్రిని ఆదర్శంగా తీసుకొని తన ముగ్గురు కొడుకుల్ని హీరోలుగా పరిచయం చేశారు. దక్షిణాది మహా నటుడు నందమూరి తారకరామారావు ఈ విషయంలో రాజ్ కపూర్‌ను అనుసరిస్తూ తొలిసారిగా తెలుగు నాట తన తనయులు హరికృష్ణ, బాలకృష్ణను నటనా రంగంలో అడుగు పెట్టేలా ప్రోత్సహించారు. అయితే నట వారసుల్లో ఎవరికీ లేనంత సుదీర్ఘమైన కెరీర్ బాలకృష్ణ సొంతం.

- బాలకృష్ణ నటించిన తొలి చిత్రం 'తాతమ్మ కల'కు కూడా కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. కుటుంబ నియంత్రణ విధానాన్ని దేశంలో తొలిసారిగా ప్రవేశపెట్టినప్పుడు ఆ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఎన్టీఆర్ నిర్మించిన సినిమా ఇది. యాభై రోజుల ప్రదర్శన పూర్తి చేసుకున్న తర్వాత సినిమాను ఆపేసి, చిన్న చిన్న మార్పులతో మళ్లీ విడుదల చేశారు. రెండు సార్లు సెన్సార్ అయి, రెండు సార్లు విడుదల అయిన సినిమా తెలుగులో ఇదొక్కటే. ఇందులో బాలకృష్ణది బాలనటుడి పాత్ర కాదు. కథలో కీలకమైన పాత్ర.
- ఎన్టీఆర్ అనితర సాధ్యంగా అభినయించిన శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రలను బాలకృష్ణ సైతం పోషించి అభిమానుల్ని అలరించారు. అంతే కాదు ఎన్టీఆర్ పోషించని అభిమన్యు, నారద, ఆంజనేయ పాత్రలను బాలకృష్ణ పోషించి అభినందనలు అందుకున్నారు. పెద్దాయన పాతాళ భైరవి వంటి జానపద చిత్రాల్లో నటిస్తే, బాలయ్య భైరవ ద్వీపం సినిమాతో అభిమానులను ఆకట్టుకున్నారు.
- ఒకే చిత్రంలో అటు భగవంతుడు, ఇటు భక్తునిగా నటించిన ఘనత తెలుగు నాట ఎన్టీఆర్, బాలకృష్ణ దే. 1964లో వచ్చిన 'శ్రీ సత్యనారాయణ మహత్మ్యం' లో ఎన్టీఆర్ శ్రీ మహా విష్ణువుగా, సత్యవ్రతుడిగా నటించారు. అలాగే 'పాండురంగడు' లో బాలయ్య శ్రీకృష్ణ, పుండరీక పాత్రలతో మెప్పించారు.
- బాలకృష్ణ ఎప్పుడూ ట్రెండ్‌ను ఫాలో కాలేదు. ఆయన నటిస్తేనే అది ట్రెండ్ అయింది. ఆ ట్రెండ్‌ను తర్వాత మిగిలిన హీరోలందరూ ఫాలో కావడం గమనార్హం. డిస్కో డ్యాన్సులు, మెషిన్‌గన్స్‌తో యాక్షన్ సినిమాలు వస్తున్న రోజుల్లో బాలకృష్ణ పంచె కట్టుతో, కర్ర సాముతో బాక్సాఫీసు దగ్గర కాసుల వర్షం కురిపించారు. ఆ తర్వాత చాలా కాలం తెలుగులో గ్రామీణ వాతావరణంలో సినిమాలు వచ్చాయి. అలాగే తెలుగులో ఫ్యాక్షన్ సినిమాల నిర్మాణం బాగా పెరగడానికి బాలకృష్ణ నటించిన 'సమరసింహా రెడ్డి', 'నరసింహనాయుడు' చిత్రాల సంచలన విజయమే కారణం.
- ఎన్టీఆర్ తన 52 వ ఏట బాపు దర్శకత్వంలో రూపొందిన శ్రీరామాంజనేయ యుద్ధం చిత్రంలో శ్రీరామునిగా నటించారు. అలాగే బాలకృష్ణ కూడా తన 52 వ ఏటనే అదే బాపు దర్శకత్వంలో శ్రీరామరాజ్యం చిత్రంలో శ్రీరామునిగా నటించడం విశేషం.
- తండ్రి పేరుతో తీసిన బయోపిక్ లో తనయుడు హీరోగా నటించిన సందర్భాలు గతంలో లేవు. అరుదైన ఆ ఘనత బాలయ్య కే దక్కింది. ఎన్టీఆర్ బయోపిక్ కథానాయకుడు, మహనాయకుడు చిత్రాల్లో బాలయ్య ఎన్టీఆర్ గా కనిపించడంతో అభిమానులు మురిసిపోయారు.
- రాజకీయ నాయకునిగా కూడా తండ్రి వారసత్వాన్ని కాపాడుతున్నారు బాలకృష్ణ. మూడు సార్లు హిందూపరం శాసనసభ్యుడిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించిన బాలకృష్ణ ప్రజా సేవలోనూ తన ముద్రను చాటారు.



ఇప్పటివరకూ రాని సినిమా



హీరో శ్రీవిష్ణు, దర్శకుడు హసిత్ గోలీ 'రాజ రాజ చోర' చిత్రం తర్వాత కలసి చేస్తున్న చిత్రం 'శ్వాగ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇందులో రాజు, భవభూతి, సింగ, యయాతి పాత్రలను శ్రీవిష్ణు, రాణి రుక్మిణీదేవి పాత్రలో రీతూ వర్మ నటించారు. ఈ చిత్రం టీజర్ విడుదల చేసిన సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో శ్రీవిష్ణు మాట్లాడుతూ ' మన అందరి ఇళ్లలో ఉన్న పాయింటే అయినా ఇండియన్ స్క్రీన్ మీద ఇప్పటివరకూ రాని సినిమా ఇది. ఇలాంటి సినిమా తీయడానికి ముందుకు వచ్చిన విశ్వప్రసాద్ గారికి కృతజ్ఞతలు. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అన్నారు. 'శ్రీవిష్ణు, హసిత్‌తో కలసి ఇంతకుముందు 'రాజ రాజ చోర' సినిమా చేశాం. 'శ్వాగ్' చాలా విభిన్న చిత్రం' అని తెలిపారు విశ్వప్రసాద్. దర్శకుడు హసిత్ గోలీ మాట్లాడుతూ 'ఇది అచ్చ తెలుగు సినిమా. కంటెంట్ చాలా మాట్లాడుతుంది. తాత, ముత్తాతలతో కలసి చూడగలిగే సినిమా. విష్ణు బాగా చేశారు. ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అవుతుంది' అన్నారు. మీరా జాస్మిన్, దక్ష నాగార్కర్, శరణ్య ప్రదీప్, సునీల్, రవిబాబు, గెటప్ శ్రీను, గోపరాజు రమణ తదితరులు నటించారు.

ఐదు భాషల్లో 'కుంభ'




స్వీయ దర్శకత్వంలో వి.సముద్ర నిర్మించే 'కుంభ' చిత్రం గురువారం హైదరాబాద్‌లో మొదలైంది. హీరో విజయ్‌రామ్‌పై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు సముద్ర సతీమణి విజయలక్ష్మి కెమెరా స్విచాన్ చేయగా, నిర్మాత డీఎస్ రావు తొలి క్లాప్ ఇచ్చారు. తొలి షాట్‌కు చంద్రమహేశ్, దేవిప్రసాద్ గౌరవ దర్శకత్వం వహించారు. 'కథలను నమ్ముకుని కొత్త వాళ్లతో ఐదు సినిమాలు తీస్తున్నాను. వాటిల్లో 'కుంభ' ఒకటి. ఐదు భాషల్లో ఈ సినిమా తయారవుతుంది' అని సముద్ర చెప్పారు. విజయ్‌రామ్ హీరోగా, సూరజ్ ఆదిత్య విలన్‌గా నటిస్తున్నారు.



కొత్తగా..

తెలుగు భాషా దినోత్సవం రోజున...

'ఎప్పటినుంచో తెలుగు భాష, సంస్కృతి, విలువల గురించి సినిమా తీయాలనే కోరిక ఉంది. సందేశంలా కాకుండా మంచి వాణిజ్య విలువలు ఉన్న అంశాలు కలిగిన కథ దొరికినప్పుడే అలాంటి సినిమా చేయాలి. ఇప్పుడు అటువంటి కథ కుదిరింది. 1980 నేపథ్యంలో జరిగే సినిమా ఇది. తెలుగు భాషా దినోత్సవం రోజున ఈ సినిమా వివరాలు ప్రకటించడం ఆనందంగా ఉంది' అన్నారు దర్శకుడు వైవీఎస్ చౌదరి. సీనియర్ ఎన్టీఆర్ ముని మనవడు నందమూరి తారక రామారావు హీరోగా, వీణా రావు హీరోయిన్‌గా నటించనున్నారు. గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా చౌదరి ఆయనకు నివాళులు అర్పించారు. చిత్ర ఎగ్జిక్యూటివ్ నిర్మాత రమేశ్ అత్తిలిని చౌదరి ఈ సందర్భంగా పరిచయం చేశారు. 'మేం నలుగురం స్నేహితులం కలసి చిత్ర నిర్మాణరంగంలోకి అడుగుపెట్టాలని అనుకున్నాం. చౌదరిగారితో కలసి ఈ ప్రాజెక్ట్ చేయడం ఆనందంగా ఉంది' అన్నారు రమేశ్ అత్తిలి. ఈ కార్యక్రమంలో నిర్మాత యలమంచిలి గీత, మాటల రచయిత బుర్రా సాయిమాధవ్, గీత రచయిత చంద్రబోస్ పాల్గొన్నారు.





స్వచ్ఛందంగా కాలువ మరమ్మతులు

- అయినా నీటి విడుదలకు ససేమిరా
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు


రైతులు మరమ్మతులు చేసుకున్న కాలువ

అద్దంకి, ఆగస్టు 29 : సాగర్ కాలువలలో నీరు ప్రవహిస్తున్నా అవసరమైన చోటకు విడుదల చేసేందుకు అధికారులు అడ్డంకులు సృష్టిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని నాగులపాడు చెరువుకు మణికేశ్వరం మైనర్ నుంచి నీరు నింపుకునే అవకాశం ఉంది. అయితే చెరువుకు నీరు చేరే కాలువలు సరిగ్గా లేకపోవడంతో సుమారు లక్ష రూపాయలు వెచ్చించి రైతులే స్వచ్ఛందంగా మరమ్మతులు చేసుకున్నారు. చెరువుకు నీరు పెడితే గ్రామంలో బోర్లలో నీటి లభ్యత పెరగడంతో పాటు సమీప పొలాలకు నీటి తడులకు అవకాశం ఉంటుందని మంత్రి రవికుమార్ దృష్టికి రైతులు తీసుకుపోయారు. నీటి విడుదల చేయాలని మంత్రి రవికుమార్ అధికారులకు చెప్పారు. అయితే కొద్దిపాటి నీరు విడుదల చేసిన ఎస్ఎస్పీ అధికారులు ఏవో కారణాలు చెప్తూ నీటి విడుదల నిలిపేశారని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు ఉద్దేశపూర్వకంగానే నీటి విడుదల నిలిపివేశారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నాగులపాడు చెరువుకు నీటి విడుదల జరిగేలా చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

నర్సింగ్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్

- పాస్ చేసేందుకు విద్యార్థుల నుంచి భారీగా వసూళ్లు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 29 : ఒంగోలులోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జరుగుతున్న నర్సింగ్ పరీక్షలలో మాస్ కాపింగ్‌కు తెర తీశారు. పరీక్ష పేపర్ల కింద స్లిప్‌లు పెట్టుకుని యథేచ్ఛగా పరీక్షలు రాయడం కనిపించింది. గురువారం నుంచి మొదలైన జనరల్ నర్సింగ్ పరీక్షలలో ఆయా కళాశాలల యాజమాన్యాలు రిమ్స్ అధికారులతో కుమ్మక్కయ్యాయి. సుమారు వారం రోజులపాటు (ఈనెల 29 నుంచి వచ్చే నెల 4 వరకు) జరిగే ఈ పరీక్షలకు జిల్లాలోని వివిధ ప్రయివేటు నర్సింగ్ కాలేజీల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇదే తరహాలో ఇక్కడ మాస్ కాపీయింగ్ జరుగుతోంది. అందుకు సంబంధించి రిమ్స్ అధికారులతో కుదిరిన ఒప్పందంతో ప్రయివేటు నర్సింగ్ కాలేజీలది ఇష్టారాజ్యం అయ్యింది. గ్యారెంటీ పాస్‌తో విద్యార్థుల నుంచి భారీ మొత్తంలో వసూలు చేశారు. పరీక్షల సమయంలో కాపీలు రాసుకునేందుకు అదనంగా మరి కొంత నగదు వసూలు చేసినట్లు సమాచారం. దీంతో విద్యార్థులు విద్యా సంవత్సరం మొత్తం చదవకపోయినా, గ్యారెంటీ పాస్ ఉందనే ధైర్యంతో పరీక్షలకు హాజరయ్యారు. అయితే విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న విషయం తెలుసుకున్న పలు మీడియా సంస్థలు ఆకస్మిక తనిఖీలు చేశాయి. దీంతో పరీక్ష పేపర్ల కింద స్లిప్‌లు పెట్టుకుని విద్యార్థులు యథేచ్ఛగా పరీక్షలు రాయడం కనిపించింది. మాస్ కాపీయింగ్‌పై రిమ్స్ అధికారులను ఆంధ్రజ్యోతి ప్రశ్నించగా తమకేమి తెలియదంటూ బుకాయించారు. రెండేళ్ళుగా తమ భాగస్వామ్యం ఏమీ లేదంటూ సమాధానం దాట వేశారు. అయితే అందిన సమాచారం మేరకు అటు జీజీహెచ్, ఇటు రిమ్స్ అధికారులకు ప్రయివేటు నర్సింగ్ కాలేజీల యాజమాన్యాలు భారీగా ముడుపులు ముట్టచెప్పినట్లు సమాచారం. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించి, మాస్ కాపీయింగ్‌లు జరగకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాల్సిన అవసరం ఉంది.


మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ తేజ్ సంగీత్

సురక్షిత నీటిని అందించడమే జలజీవన్ లక్ష్యం

చినగంజాం, ఆగస్టు 29 : గ్రామంలోని ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీటిని సరఫరా చేయడమే జలజీవన్ మిషన్ లక్ష్యమని జిల్లా కోఆర్డినేటర్ తేజ్ సంగీత్ అన్నారు. మండలంలోని కడవకుదురు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ గొల్లమూరి శివకుమారి అధ్యక్షతన జలజీవన్ మిషన్‌పై గురువారం జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో ఆర్థిక సహకారం అందిస్తూ ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ ద్వారా మనిషికి 55 లీటర్ల మంచినీటిని అందించనున్నట్లు తేజ్ సంగీత్ తెలిపారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని జలజీవన్ మిషన్ జిల్లా సమన్వయ కర్త టి.రంగారావు సూచించారు. ఇళ్లవద్ద ఇంకుడు గుంతను నిర్మించుకోవాలని తద్వారా భవిష్యత్ తరాల వారికి నీటి కొరత నుంచి రక్షణ కల్పించాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో డయేరియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎన్.సూర్యనారాయణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పి.బాలసాయికుమార్, స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ నున్నం ఆశోక్‌కుమార్, వైద్య, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల హెచ్.ఎం.కుర్రా రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన పీటీసీ ప్రిన్సిపాల్

ఒంగోలు(క్రైం), ఆగస్టు 29 : పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ) ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.వి.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి ఇంటెలిజెన్స్ ఆర్ఐఓగా పనిచేస్తున్న శ్రీనివాసరావు బదిలీపై ఒంగోలు పీటీసీకి వచ్చారు. అక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఏఆర్ దామోదర్ జిల్లా ఎస్పీగా బదిలీ కావడంతో ఆ స్థానంలో శ్రీనివాసరావును నియమించారు.

జెండా ఎత్తేద్దాం

కూటమివైపు వైసీపీ నేతల చూపు

ఎమ్మెల్సీ సునీత పార్టీకి, పదవికి రాజీనామా

ఆయా పార్టీల నేతల టచ్‌లో మరో ముగ్గురు మాజీలు

జిల్లా అధ్యక్ష పదవికి ససేమిరా అంటున్న నేతలు

కొన్ని అసెంబ్లీలకు దూరమైన ఇన్‌చార్జులు



విపక్ష వైసీపీకి జిల్లాలో ఆ పార్టీ నాయకులు గుడ్‌బై చెప్పేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అనేకమంది కూటమివైపు దృష్టిసారించటం అందుకు నిదర్శనం. అవకాశం ఉంటే టీడీపీలోకి లేదంటే జనసేనలోకి మరీ కాదంటే బీజేపీలో చేరేందుకు పావులు కదుపుతున్నారు. అందుకనుగుణంగా ఇప్పటికే కొందరు నాయకులు అడుగులు వేయటం ప్రారంభమైంది. గిద్దలూరు, అద్దంకి నియోజకవర్గాల్లో కొందరు బీజేపీలో చేరగా, పొదిలిలో కొందరు జనసేన జెండా పట్టుకొని తిరుగుతున్నారు. తాజాగా ఆ పార్టీ ఎమ్మెల్సీ పోతుల సునీత పదవికి, పార్టీకి రాజీనామా చేశారు ఇంకోవైపు జిల్లాలో కీలకనేత బాలినేనితో పాటు మరో ఇద్దరు, ముగ్గురు మాజీలు కూటమిలోని నేతలకు టచ్‌లో ఉన్నట్లు సమాచారం. దీనికితోడు వైసీపీ జిల్లా అధ్యక్ష పదవి తీసుకునేందుకు ఎవ్వరూ ముందుకు రావటం లేదు. ఓటమి చెందిన పలువురు మాజీలు తిరిగి తమకు పాత నియోజకవర్గాలు కేటాయించాలని అధినేతపై ఒత్తిడి చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికారాన్ని కోల్పోవటమే కాక భారీ ఓటమి ఎదురైన మా నాయకుడిలో(జగన్) ఎలాంటి మార్పు కనిపించటం లేదు. పాత పద్ధతిలోనే ఆయన పోకడ ఉంది. అందుకే మాదారి మేము చూసుకోక తప్పటం లేదు. జిల్లాలోని వైసీపీ నాయకుల్లో కొందరు చెబుతున్న మాట ఇది. అలా చెప్పే సీనియర్ నాయకులు రోజురోజుకు పెరిగిపోతుండగా గ్రామ, మండల స్థాయిలో వైసీపీ నాయకులైతే ఎప్పుడో పక్కదారి పట్టారు. కూటమి ప్రభుత్వంలోని మూడు పార్టీలు కూడా వైసీపీ నుంచి వచ్చేవారిని చేర్చుకొని ఆ పార్టీని నిర్వీర్యం చేయాలనే ఆలోచనలో ఉన్నాయి. దీంతో కూటమి వైపు దృష్టిసారించిన వైసీపీ నేతలకు కూడా సానుకూల సంకేతాలు అందుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో కూటమిలోని మూడు పార్టీల నేతలు వైసీపీ వారిని తమ పార్టీలోకి చేర్చుకునేందుకు శ్రీకారం పలికారు. ఒంగోలులో వైసీపీ కార్పొరేటర్లతోపాటు వారి వెంట వచ్చిన కొందరు నాయకులకు పచ్చకండువాలు కప్పారు. గిద్దలూరు, చీరాల మున్సిపాలిటీల్లో ఈ తంతు సాగింది. దర్శిలోని ముండ్లమూరు మండలంలోని వైసీపీ ఎంపీటీసీ సభ్యులంతా టీడీపీలో చేరిపోయారు. పొదిలిలో భూ వివాదాల్లో చిక్కుకున్న ఒక వైసీపీ నాయకుడు జనసేనలో సభ్యులను చేర్పించి ఆ పార్టీలో పెత్తనం కోసం తహతహలాడుతున్నాడు. ఇటీవల గిద్దలూరు, అద్దంకి నియోజకవర్గాలకు చెందిన కొందరు వైసీపీ నాయకులు నేరుగా బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరీ వద్దకు వెళ్లి ఆ పార్టీలో చేరిపోయారు. ఇలా చూస్తే ప్రతి నియోజకవర్గంలోను ఏదోస్థాయిలో వైసీపీ శ్రేణులు, నాయకులు కూటమి పార్టీల్లో చేరిపోయే తంతు జరుగుతుంది.

వైసీపీకి ఎమ్మెల్సీ సునీత రాజీనామా

ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ, వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలైన పోతుల సునీత బుధవారం శాసనమండలి సభ్యత్వానికి అలాగే వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు ఆ మేరకు అటు శాసనమండలి చైర్మన్‌కు ఇటు వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు రాజీనామా లేఖలు పంపారు. రాష్ట్రంలో వైఎస్ కుటుంబానికి సన్నిహితుడైన రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణతోపాటు మరికొందరు రాజ్యసభ సభ్యులు పార్టీకి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయబోతున్నట్లు వెల్లడైంది. రాజ్యసభలో అలాగే శాసనమండలిలో టీడీపీ కూటమి పార్టీలు తమ బలాన్ని పెంచుకునే దిశగా అటు రాజ్యసభ సభ్యులు ఇటు ఎమ్మెల్సీలను ప్రోత్సహిస్తున్నారు. పార్టీకే కాక పదవులకు రాజీనామా చేసి రావాలని కోరుతున్నారు. తదనుగుణంగా వారికి ప్రత్యామ్నాయ పదవులపై హామీలు కూడా ఇస్తున్నారు. రానున్న వారం రోజుల్లో వైసీపీ రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు కూటమి పార్టీల్లో చేరే ప్రక్రియ ముమ్మరమయ్యే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. పోతుల సునీత రాజీనామాను అందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 2014లో టీడీపీ తరపున చీరాల నుంచి పోటీచేసి ఓడిన ఆమెను గౌరవించి ఎమ్మెల్సీని చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే ఆమె టీడీపీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. ఒప్పందం మేరకు అక్కడ తిరిగి ఎమ్మెల్సీ అయ్యారు. నిన్న మొన్నటివరకు టీడీపీపై ముఖ్యంగా చంద్రబాబుపై తీవ్ర విమర్శలు చేసిన సునీత ఆకస్మాత్తుగా వైసీపీ పదవికి రాజీనామా చేయటంలోని పరమార్థం ఇట్టే అర్థమవుతుంది.

టచ్‌లో మరికొందరు మాజీలు

కాగా ఆ పార్టీలో కీలకంగా ఉన్న ఒంగోలు మాజీ ఎమ్మెల్యే బాలినేనితోపాటు మరికొందరు కీలక నాయకులు కూటమిలోని మూడు పార్టీల్లో కొందరికి టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇద్దరు ముగ్గురు మాజీలైతే ఆయా పార్టీల్లోని నాయకులతో చర్చలు కూడా జరిపారు. కుదిరితే టీడీపీ, కాకపోతే జనసేన, అదీ కాకపోతే బీజేపీలో చేరేందుకు సిద్ధమై కొందరు ముఖ్యమైన నాయకుల వైపు అడుగులు వేస్తున్నట్లు సమాచారం. టీడీపీ విషయానికి వస్తే రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు ఆ తర్వాత కీలకమైన ప్రజాప్రతినిధులను మాత్రమే చేర్చుకునేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉదాహరణకు టీడీపీలో చేరబోతున్న రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ ప్రకాశం జిల్లాలోని ఒకరిద్దరు కీలక నేతల పేర్లు కూడా టీడీపీ నాయకుల వద్ద ప్రస్తావించి తీసుకోవాలని చెప్పినట్లు తెలిసింది. ప్రస్తుతానికి బాలినేని జనసేన ముఖ్య నాయకుల మధ్య చర్చలు జరుగుతుండగా మరో ఇద్దరు మాజీలు కూటమిలోని వివిధ పార్టీల నేతలతో టచ్‌లో ఉన్నారు. ఆ పార్టీలో ఉన్న ఇద్దరు ముగ్గురు ప్రజాప్రతినిధులు కూడా కూటమి పార్టీల్లోని నేతలకు టచ్‌లో ఉండటం విశేషం. ఇక జిల్లాలోని వైసీపీ ఎంపీపీలు, జడ్పీటీసీలు అయితే ఇప్పటికే టీడీపీ ఎమ్మెల్యేలకు టచ్‌లోకి వెళ్లారు. కొన్ని నియోజకవర్గాలకు చెందిన ఐదారుగురు ఎంపీపీలు, జడ్పీటీసీలు ఇటు బీజేపీ అటు జనసేన నేతలకు టచ్‌లో ఉండటం విశేషం.

జిల్లా అధ్యక్ష పదవికి ముందుకు రాని వైనం

కాగా వైసీపీ జిల్లా అధ్యక్ష పదవి తీసుకునేందుకు ఆ పార్టీ నాయకులు ముందుకు రాకపోవటం విశేషం. ప్రస్తుత అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి పార్టీ ఓటమి అనంతరమే అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత జగన్ జిల్లాకు చెందిన నాయకులను పక్కనపెట్టి తిరుపతి జిల్లాకు చెందిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని పార్టీ అధ్యక్షుడిని చేయాలని భావించారు. ఆ ప్రతిపాదనను బాలినేనితోపాటు నాయకులందరూ వ్యతిరేకించారు. దీంతో చెవిరెడ్డికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చిన జగన్ జిల్లా అధ్యక్ష పదవికి పేర్లను ఇటు బాలినేని అటు వైవీలను సూచించాలన్నట్లు తెలిసింది. అయితే ఆ పదవి తీసుకునేందుకు ఎవ్వరూ ముందుకు రాకపోవటం విశేషం. దీంతో జగన్ బలవంతంగానైనా దర్శి ఎమ్మెల్యే బూచేపల్లికి పార్టీ బాధ్యతలు అప్పగించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ముందొచ్చిన పండుగ

రేపే పింఛన్ల పంపిణీ

ఒక రోజు ముందుగానే చేతికి డబ్బులు

జిల్లాకు రూ.123 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం



ఒంగోలు నగరం, ఆగస్టు 29: రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పింఛన్లను ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు అందజేయనుంది. ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ సొమ్మును అందిస్తున్న ప్రభుత్వం సెప్టెంబర్ మాసానికి సంబంధించిన సొమ్మును ఆ గస్టు నెల 31వ తేదీనే లబ్ధిదారుల చేతిలో పెట్టనుంది. ఒకటో తేదీ ఆదివారం కావటంతో ఒక రోజు ముందుగానే అంటే 31వ తేదీ శనివారం నాడే పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం శుక్రవారం నాటికి పూర్తి చేయనుంది. శనివారం ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో మొత్తం 2,89,096 పింఛన్లు ఉండగా వీరికి పింఛన్ సొమ్మును అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.123,01,33,000 లను విడుదల చేసింది. శనివారం జిల్లాలో పింఛన్లను పంపిణీ చేసేందుకు బ్యాంకుల నుంచి డబ్బులను సచివాలయ సిబ్బంది శుక్రవారమే డ్రా చేయనున్నారు. గతంలో వలంటీర్ల ద్వారా పింఛన్ల సొమ్మును పంపిణీ చేయగా రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరాక సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీకి శ్రీకారం చుట్టింది. దీంతో ఈ నెల 31వ తేదీన కూడా ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ద్వారానే పింఛన్లను పంపిణీ చేయనుంది. జిల్లాలో వృద్ధాప్య పింఛన్లు 1,57,116, వితంతు పింఛన్లు 67,913, దివ్యాంగుల పింఛన్లు 33,590, ఒంటరి మహిళల పింఛన్లు 7,808,చర్మకారుల పింఛన్లు 5,339, డప్పు కళాకారుల పింఛన్లు 4,682,మత్స్యకారుల పింఛన్లు2,530, చేనేత కార్మికుల పింఛన్లు 1,811, కల్లుగీత కార్మికులు 246, హిజ్రాల పింఛన్లు 90తో పాటు అభయ హస్తం, దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, సైనిక సంక్షేమశాఖ ద్వారా గుర్తించిన వారికి ఇచ్చే పింఛన్లు మొత్తం కలిపి జిల్లాలో 2,89,096 మంది ఉన్నారు. వీరందరికీ ఈ నెల 31వ తేదీనే సెప్టెంబర్ మాసానికి సంబంధించిన పింఛన్లను ప్రభుత్వం ఇంటి వద్దనే అందించనుంది. శనివారం అందుబాటులో లేని లబ్ధిదారులకు సోమవారం ఇంటి వద్దకే వెళ్లి అందజేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. సోమవారం నాటికి నూటికి నూరుశాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. పింఛన్ల పంపిణీకి తగినంత మంది సచివాలయ సిబ్బంది లేకపోవటంతో ఇతర శాఖల ఉద్యోగులను కూడా పింఛన్ల పంపిణీకి కేటాయించారు. వీరు శనివారం ఇంటింటికీ తిరిగి పంపిణీ చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించి అమలు చేస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఒక రోజు ముందుగానే చేపట్టి లబ్ధిదారుల కళ్లల్లో ఆనందాన్ని చూడనుంది.

దోర్లు తెరవక ముందే వైసీపీ ఖాళీ

- మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 29 : తెలుగుదేశంపార్టీ డోర్లు ఓపెన్ చేయకుండానే వైసీపీ ఖాళీ అవుతోందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి అన్నారు. స్థానిక రిమ్స్‌లో బంగారు బాల్యం కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం వచ్చిన మంత్రి స్వామి విలేఖరులతో మాట్లాడారు. వైసీపీ నుంచి వచ్చే వారి జాబితా ఇప్పుడే చెప్పలేమని, ఒకసారి తెలుగుదేశం పార్టీ డోర్లు ఓపెన్ చేస్తే వైసీపీ క్లోజ్ చేసుకోవాల్సిందేనని స్వామి స్పష్టం చేశారు. జగన్ సర్కార్ వైద్యఆరోగ్యశాఖను భ్రష్టు పట్టించిందని, ఇప్పుడు వైద్యశాఖపై మాట్లాడే అర్హత జగన్మోహన్‌రెడ్డికి లేదని మంత్రి అన్నారు. సింగరాయకొండలో 30 పడకల ఆసుపత్రిని ఆరుపడకల ఆసుపత్రిగా మార్చిన ఘనత జగన్‌దని ఆయన మండిపడ్డారు. వైద్య, ఆరోగ్యశాఖను నిర్వీర్యం చేసిన వ్యక్తులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. అందరికీ వైద్యం అందుబాటులోకి తెచ్చేలా కృషి చేస్తున్నామని వివరించారు. అలాగే జిల్లా వైద్యశాలలో మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి స్వామి తెలిపారు.

వివాహేతర సంబంధం వద్దన్నందుకు దాడి

చీరాలటౌన్, ఆగస్టు 29 : వివాహేతర సంబంధంతో ఓ ప్రేమికుడు తల్లిదండ్రులపై దాడికి పాల్పడ్డాడు. ఈఘటన చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ప్రేమికుడు చీరాలకు చెందిన వ్యక్తి కాగా ప్రియురాలిది వేరే మండలం. అలాగే ఆమెకు ఇద్దరు కుమారులు. అయితే ప్రేమికుడికి ఇంకా పెళ్లి కాలేదు. ప్రియురాలి వద్దకు వెళ్లవద్దని తల్లిదండ్రులు మందలిస్తుండడంతో వారిపై దాడికి పాల్పడ్డాడు. అయితే బాధితులు గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా స్టేషన్ నుంచి ఇద్దరు కానిస్టేబుళ్లు అతడిని స్టేషన్‌కు తెచ్చేందుకు ఇంటికి వెళ్లారు. పోలీసులనే భయపెడుతూ ప్రియుడు నన్ను స్టేషన్‌కు తీసుకువెళితే హార్పిక్ తాగుతానని బెదిరించాడు. దీంతో భయాందోళన చెందిన పోలీసులు చేసేదిలేక వెనుదిరిగారు.



పూర్వ ఎంఈవో సస్పెన్షన్‌పై విచారణ


ఎంఈవో కార్యాలయంలో విచారణ చేస్తున్న కమిటీ

బల్లికురవ, ఆగస్టు 29 : బల్లికురవ ఎంఈవోగా పనిచేసి ఆరు మాసాల కిందట పలు ఆరోపణలతో సస్పెండ్ అయిన వీరాఘవయ్యపై గురువారం బోయపాలెం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు ఆధ్వర్యంలో కమిటీ విచారణ చేపట్టింది. ప్రస్తుతం కొరిశపాడు ఎంఈవోగా విధులలో ఉన్న వీరాఘవయ్యపై గతంలో బల్లికురవ మండలంలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పై అధికారులకు ఫిర్యాదు చేశారు. వాటిపై అప్పట్లో అధికారులు సస్పెండ్ చేశారు. అనంతరం అయపై పెట్టిన ఫిర్యాదులపై పూర్తి విచారణ చేయాలని గుంటూరు విద్యాశాఖ ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి బోయపాలెం డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌ను మరియు కొందిరిని కమిటీ సభ్యులుగా నియమించారు. ఈ కమిటీ బల్లికురవ విద్యావనరుల కేంద్రానికి వచ్చి ప్రస్తుతం విధులలో ఉన్న ఎంఈవో వస్త్రంనాయక్ వద్ద ఉన్న రికార్డులను పరిశీలించి అనంతరం ఫిర్యాదులు చేసిన ఉపాధ్యాయులను మరియు అభియోగాలు ఎదుర్కొంటున్న పూర్వపు ఎంఈవో వీరాఘవయ్యను విచారణ చేపట్టారు. అనంతరం వారి వద్ద వ్రాతపూర్వకంగా వివరణలు తీసుకున్నారు. నివేదికలను ఉన్నతాధికార్లకు అందజేస్తామని విచారణ కమిటీ తెలిపింది.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

DISTANCE EDUCATION

గీతం డిగ్రీ కాలేజి, ఆచార్య నాగార్జున యూనివర్శిటీ అథరైజ్డ్ స్టడీ సెంటర్ నందు B.A, BBA, B.Com, B.Lisc, MA(ALL), M.Com, MHRM, MSW కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. ఒంగోలు. సెల్: **98491 24970.**

AJO-200101

WANTED

ఒంగోలు మంగమూరు రోడ్డులోని నారాయణ పబ్లిక్ స్కూలు నందు పని చేయుటకు Graduate Evening Study Teachers కావలెను. సంప్ర॥ **6305766244**

AJO-300

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు.బట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడిఎంటి

బాలినేని అక్రమాలపై దర్యాప్తు జరపండి

సీఎంను కోరిన దామచర్ల, రియాజ్

అందరూ చెప్పిన అధికారులనే వేయాలని విజ్ఞప్తి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలు మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు జరిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్‌లు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు పలు అంశాలతో కూడిన సమాచారం లేఖను ఆయనకు అందించారు. గురువారం సాయంత్రం సచివాలయంలో ముఖ్య మంత్రిని వారు కలిశారు. ఇటీవల ఒంగోలు కార్పొరేషన్‌లో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మేయర్, మరో 18 మంది కార్పొరేటర్లను దామచర్ల చంద్రబాబు వద్దకు తీసుకెళ్లారు ఆ సందర్భంగా ముందుగా రియాజ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సింగరాజు రాంబాబులను తీసుకొని చంద్రబాబును జనార్దన్ కలిశారు. ఒంగోలులో బాలినేని వియ్యంకుడు భాస్కర్‌రెడ్డి నిర్మిస్తున్న విలాస్ ప్రాజెక్టు నిర్మాణంలో చోటుచేసుకున్న అవకతవకలపై ప్రత్యేకంగా దర్యాప్తు చేయించాలని కోరినట్లు తెలిసింది. ఎరజర్ల కొండ నుంచి అక్రమంగా ఎర్రమట్టిని తోలుకోవటంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా పైపులైన్ వేసి మంచినీటిని నిర్మాణ పనులకు వాడుకున్నారని, విద్యుత్‌శాఖ అధికారులు కూడా నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారని వారు పేర్కొన్నట్లు తెలిసింది. ఈ విషయాల్లో లోతైన దర్యాప్తు జరిపితే పలు అక్రమాలు వెలుగులోకి వస్తాయని వారు సీఎంకు వివరించే ప్రయత్నం చేశారు. అలాగే ఎరజర్ల కొండల ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు భూమి అభివృద్ధి పేరుతో కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని వారు సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. బాలినేని మంత్రిగా ఉన్న సమయంలో అక్కడ రూ.40 కోట్లు వెచ్చించారని దర్యాప్తు చేస్తే అవినీతి బాగోతం బయటపడుతుందని తెలిపినట్లు తెలిసింది. ఒంగోలులో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూకబ్జాలపై దర్యాప్తు సిట్‌ను ఏర్పాటు చేసినా సక్రమంగా దర్యాప్తు జరపలేదని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కొందరు భూముల ఆక్రమణల్లో బాలినేనితో పాటు అతని సన్నిహితులు హస్తం కూడా ఉందని చెప్పినట్లు తెలిసింది. సిట్‌ను పటిష్ఠపర్చి విచారణ చేయించాలని కోరినట్లు తెలిసింది. అలాగే ఎన్నికలకు ముందు హడావుడిగా పేదలకు నివేశన స్థలాలు కేటాయించారని అందులో సుమారు 12వేల మంది బోగస్ లబ్ధిదారులు ఉన్నారని పేర్కొంటూ ఆ అంశాన్ని పరిశీలించాలని కోరినట్లు తెలిసింది. వారు చెప్పిన అంశాలను సావధానంగా విన్న సీఎం చంద్రబాబు సీఎంవో అధికారులను వాటిని పరిశీలించాని సూచించినట్లు తెలిసింది.

బదిలీలపై కలిసి మాట్లాడండి

కాగా ఇదే సమయంలో ఎమ్మెల్యే దామచర్ల జిల్లా అధికారుల బదిలీల అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. తాము సూచించిన అధికారులను నియమించే విధంగా చూడాలని కోరినట్లు తెలిసింది. మూడు నాలుగు శాఖల అధికారుల నియామకంపై ప్రతిష్టంభన ఉందని, మిగిలిన ఎమ్మెల్యేల అంగీకారంతో ఎంపిక చేసిన వారిని ఆ పోస్టులకు కేటాయించాలని కోరినట్లు తెలిసింది. సీఎం స్పందిస్తూ అన్నీ పరిశీలించే నియామకాలు జరుపుతున్నారని జిల్లా పరిధిలోని వారందరూ కూర్చుని మాట్లాడుకోవాలని చెప్పినట్లు తెలిసింది. అనంతరం ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మరో 18 మంది కార్పొరేటర్లతో పాటు టీడీపీ, జనసేనకు చెందిన ఆరుగురు కార్పొరేటర్లను ముఖ్యమంత్రికి పరిచయం చేశారు. ఒంగోలు అభివృద్ధిని కాంక్షించి వారంతా పార్టీలో చేరారని ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలని జనార్దన్, మేయర్ సుజాతలు సీఎంను కోరారు. అనంతరం కార్పొరేటర్లతో సీఎం గ్రూపు ఫొటో దిగారు.



భవిత కేంద్రం తనిఖీ

యద్దనపూడి, (మార్టూరు) ఆగస్టు 29 : యద్దనపూడి మండలంలోని ఎంపీపీఎస్ పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రాన్ని గురువారం స్టేట్ ఐఈ వింగ్ అధికారి మల్లికారునరావు, జిల్లా కోఆర్డినేటరు ఎం.జ్యోత్స్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ఉన్న రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సం ఖ్యను పెంచాలని కోరారు. ముఖ్యంగా ప్రశస్త్ యాప్‌ను మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందరూ డౌన్‌లోడ్ చేసుకొని పిల్లల వివరాలను నమోదు చేయాలన్నారు. అనంతరం ఎంఆర్‌సీ భవనానికి వెళ్లి ఎంఈవో గోపితో మాట్లాడారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేటర్ రజని, కే సురేఖ పాల్గొన్నారు.

అన్నిదానాల్లో నేత్రదానం మిన్న

చీరాలటౌన్, ఆగస్టు 29 : అన్నిదానాల్లో నేత్రదానం మిన్న అని ఏరియా హాస్పిటల్ వైద్యుడు డా.రాజ్‌కమాఆర్, డా.స్వేష్ట అన్నారు. 39వ నేత్రదాన పక్షోత్సవాలను గురువారం చీరాల ఏరియా హాస్పిటల్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మరణించిన తరువాత సుమారు 6 గంటలపాటు వారి నేత్రాలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. చనిపోయిన తరువాత మనతో పాటు నేత్రాలు వ్యర్థం కాకుండా ఇతరులకు దానం చేయడం వలన పునఃర్జన్మ ప్రసాదించిన వారిగా చరిత్రలో మిగిలి ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అధికారులు వెంకటేశ్వర్లు, సుధాకర్, ప్రజలు పాల్గొన్నారు

చెక్‌డ్యాంలకు సాగర్ కళ

మార్టూరు, ఆగస్టు 29 : మండలంలోని కొన్ని గ్రామాలలో చెక్‌డ్యాంలు సాగర్ నీటితో కళకళ లాడుతున్నాయి. రైతులు వర్షాలు కోసం ఎదురుచూస్తున్నారు. ఇదిగో వస్తున్నా ఇదిగో వస్తున్నా అంటూ వాన మబ్బులు ప్రజలను ఊరిస్తున్నాయేగానీ ఇంత వరకు ఒక మోస్తరు వానజల్లు కూడా కురవలేదు. పగటి పూట ఎండలు మండిపోతున్నాయి. రాత్రి సమయంలో వేసవి గాలులు వీస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ముఖ్యంగా మార్టూరు వాగుపై, రాజుగారిపాలెం వాగు, ఇసుకదర్శి వాగు, జొన్నతాళివాగులపై ఉన్న చెక్ డ్యాంలలో నీళ్లు నిండుకున్నాయి. వాటిలో రాజుగారిపాలెంలో ఉన్న 4 చెక్ డ్యాంలులో నీళ్లు నిండి కిందకు ప్రవహిస్తున్నాయి. 2016 నుంచి 2018 కాలంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో రాజుగారిపాలెంలో పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు నాలుగు చెక్ డ్యాంల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాంతో అప్పటివరకు వాగు నుంచి వృథాగా దిగువకు మార్టూరు వాగుకు వెళ్లిపోయే నీరు చెక్ డ్యాంలు కారణంగా రాజుగారిపాలెంలో కొంతమేర నిలబడిపోతున్నాయి. ఆనాటి నుంచి అడపదడపా సాగర్ జలాలు వచ్చిన సమయంలోగాని, లేదా వర్షాలు కురిసిన సమయంలోగాని వాగునీరు చెక్ డ్యాంలకు చేరుతున్నది. వేసవిని తలపిస్తున్న ప్రస్తుత సమయంలో కూడా, ఇటీవల విడుదలైన సాగర్ జలాలు కారణంగా చెక్ డ్యాంలకు నీళ్లు చేరాయి. దాంతో గ్రామంలోని భూగర్భ జలాలు కూడా పెరిగాయని గ్రామస్థులు అంటున్నారు. అంతేగాకుండా ఈ చెక్ డ్యాంల పరిధిలో దాదాపుగా 200 ఎకరాలు రైతుల పొలాలు ఉన్నాయి. వాటిలో కొంతమంది రైతులు మాగాణి సాగు చేపట్టి ఇప్పటికే నార్లు పోశారు. మరి కొంతమంది రైతులు మెట్టపంటలు, కూరగాయల సాగు చేపట్టారు ఈ గ్రామంలో కూరగాయలను సాగు చేసే రైతులు ఎక్కువగా ఉన్నారు. పొలాలకు వాగు నీటితో పాటు, చెక్ డ్యాంలోని నీటిని కూడా వినియోగించుకుంటూ పంటల సాగుచేపట్టారు. సాగర్ జలాలును విడుదల చేసిన తర్వాత గ్రామాలలోని మంచినీటి చెరువులకు సమృద్ధిగా సాగర్ జలాలు చేరాయి. దాంతో పాటు చెక్ డ్యాంలకు కూడా నీళ్లు చేరడంతో వాటిపై ఆధారపడి సన్న చిన్న కారు రైతులు సాగు చేపట్టారు.



రాజుగారిపాలెంలో నీటితో కళకళ లాడుతున్న చెక్‌డ్యాం



రైతులతో మాట్లాడుతున్న ఏవో వెంకటకృష్ణ

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

అద్దంకిటౌన్, ఆగస్టు 29 : విత్తనశుద్ధితోనే తెగుళ్లను నివారించుకోవచ్చని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని కలవకూరు గ్రామంలో రైతులతో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వరి కేజీ విత్తనాలకు 5గ్రాముల సుడోమోనాస్‌తో విత్తన శుద్ధి చేసుకుంటే అగ్గి తెగులు, పాముపొడ తెగుళ్లను నివారించుకోవచ్చన్నారు. రైతులు మంచి వ్యవసాయ పద్దతులు పాటించడం ద్వారా నాణ్యమైన పంటలు పండించుకోవచ్చన్నారు. విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం వలన భూమి ఆరోగ్యం, మనుషుల ఆరోగ్యం పాడైపోతాయన్నారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు మస్తాన్‌రావు, రైతులు పాల్గొన్నారు.

గడపగడపకు సభ్యత్వ నమోదు

పంగులూరు, ఆగస్టు 29 : సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా భారతీయ జనతా పార్టీని గడపగడపకు తీసుకెళ్లాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మండవ రామకృష్ణ కోరారు. పార్టీ మండల కమిటీ సమావేశం గురువారం పంగులూరులో జరిగింది. కేంద్ర, రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం సెప్టెంబరు 1 నుంచి చేపట్టే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు నరసరాజు, సురేష్, కొల్లి కోటేశ్వరరావు, టైలర్ సుబ్బారావు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లను చూపిస్తున్న ఎస్‌ఐ శివకుమార్, సిబ్బంది

చీరాల, ఆగస్టు 29 : మండల పరిధిలోని వాడరేవు గ్రామం చినబరపలో మద్యం అక్రమంగా నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్న నేపథ్యంలో ఈపురుపాలెం ఎస్సై శివకుమార్, సిబ్బందితో కలసి గురువారం దాడి చేశారు. నిందితుల నుంచి 30 మద్యం సీసాలు(క్వార్టర్లు), 16 బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మధ్యవర్తినామా రాసి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

మహిళ అరెస్టు

కారంచేడు(పర్చూరు), ఆగస్టు 29 : కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామంలో అక్రమంగా మద్యంను విక్రయిస్తున్నారన్న సమాచారంతో గురువారం ఎస్ఐ వెంకటరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో గ్రామానికి చెందిన మహిళ నుంచి 9 బాటిళ్ళను పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి కూలీ మృతి

బల్లికురవ, ఆగస్టు 29 : బెండ కాయలు కోసి ఇంటికి ట్రాక్టర్ గొర్రుపై కూర్చొని వస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ షేక్ కరీమూన్ (46) మృతి చెందగా, మరో కూలీ రెహానా తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం జరిగింది. కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన రైతు కొమ్మినేని పోతురాజు తన తోటలో బెండకాయలు కోసేందుకు అయిదుగురు కూలీలను ట్రాక్టర్‌పై తీసుకుని వెళ్లి తిరిగి గొర్రుపై ఎక్కించుకొని ఇంటికి తీసుకు వస్తుండగా ట్రాక్టర్ పిన్ను కూలీలకు తగలడంతో ఒక్క సారిగా గొర్రుపై ఉన్న షేక్ కరీమూన్ కింద పడిపోయి కొంత దూరం ఈడ్చుకు వచ్చి తీవ్రంగా గాయపడింది. రెహానా కూడా కిందిపడి గాయపడింది. ఇద్దరినీ నర్సారావుపేట వైద్యశాలకు తరలిస్తుండగా సంతమాగులూరు వద్దకు వెళ్లే సరికి కరీమూన్ మృతి చెందింది. బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కరీమూన్‌కు భర్త, ఇద్దరు కుమార్తెలున్నారు.

విద్యార్థినిపై ఆటో డ్రైవర్ లైంగిక దాడి

పోక్సో కేసు నమోదు

అద్దంకి, ఆగస్టు 29 : విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు లైంగిక దాడికి పాల్పడ్డ సంఘటనపై అద్దంకి పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన 16 ఏళ్ల బాలిక హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల యువకుడు ఆటో నడుపుతూ 6నెలలుగా పాఠశాలకు వెళ్లి వచ్చే సమయంలో బాలిక వెంట పడుతూ బెదిరిస్తున్నాడు. తల్లిదండ్రులకు చెబితే చదువు మాన్పిస్తారన్న భయంతో బాలిక ఇంట్లో చెప్పలేదు. స్కూల్ నుంచి వచ్చే సమయంలో బెదిరించి పలుమార్లు దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆ యువకుడిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ప్రవీణ పలు సెక్షన్లతోపాటు పోక్సో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

21 మందికి వైద్య సేవలు

ఇంకొల్లు, ఆగస్టు 29 : మండలంలోని వంకాయలపాడులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వైద్య పరీక్షలు చేసారు. సుమారు 21 మందికి వైద్య సేవలందించినట్లు డాక్టర్ డా.అంజలి తెలిపారు. సీహెచ్‌వో కోటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్‌ల పంపిణీకి రంగం సిద్ధం

ఇంకొల్లు, ఆగస్టు 29 : ఇంకొల్లు మండలంలోని 15 సచివాలయాల పరిధిలోని ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు ఎంపీడీవో రాజ్యలక్ష్మి తెలిపారు. సుమారు రూ.3,17,16,500 ఈనెల 30వ తేదీన సచివాలయాలకు అందజేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు.

బైక్ కవర్‌లో నుంచి రూ.2.50లక్షలు చోరీ

అద్దంకి, ఆగస్టు 29 : ఆపి ఉన్న మోటార్‌సైకిల్ ట్యాంక్ కవర్‌లో నుంచి రూ.2.50లక్షల నగదు అపహరించుకు పోయిన సంఘటనపై పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కలవకూరుకు చెందిన బిక్కా అంజిరెడ్డి వ్యవసాయ పనుల నిమిత్తం బుధవారం అద్దంకి పట్టణంలోని ఎస్‌బీఐ (ఏడీబీ) నుంచి రూ.2.50లక్షలు డ్రా చేసి ఇంటికి వెళ్తూ టీ తాగేందుకు భవానీసెంటర్‌లోని మసీదు సమీపంలోని టీ దుకాణం వద్ద ఆగాడు. అంజిరెడ్డి మోటార్‌సైకిల్ ఆపిన వెంటనే గుర్తు తెలియని వ్యక్తి వచ్చి రూ.2.50లక్షల నగదు తీసుకొని పరిగెత్తాడు. సమీపంలో మరో వ్యక్తి మోటార్‌సైకిల్‌పై ఆగి ఉండడంతో ఇద్దరు కలిసి ఆ మోటార్‌సైకిల్ పై వెళ్లారు. వెంబడించినప్పటికీ దొంగలు దొరకలేదు. అంజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మహిళా ఎస్ఐ ప్రవీణ తెలిపారు.

అద్దంకిలో నేడు

ఆర్టీసీ డిపో ఎదుట ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు నైట్ అవుట్ అలవెన్స్‌లు కలపడంతో ట్రెజరీ అధికారుల వైఖరికి నిరసనగా గేట్ మీటింగ్, నల్లబ్యాడ్జీలతో నిరసన. కార్మికులు పాల్గొనాలని నాయకుడు బాబు తెలిపారు.

- వన మహోత్సవం సందర్భంగా పట్టణంలో భవానీసెంటర్‌లో ఉదయం 9.30 గంటలకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం.
- తిమ్మాయపాలెం జడ్పీహెచ్‌ఎస్‌లో జిల్లా అటవీశాఖ, ఎన్ఆర్ఈజీఎస్‌ల సౌజన్యంతో ఉదయం 9గంటలకు వనమహోత్సవ ప్రతిజ్ఞ, గ్రామంలో ర్యాలీ, అనంతరం పాఠశాలల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమం జరుగుతుందని ప్రోగ్రం ఆర్గనైజర్ ఎం.త్రిమూర్తులు తెలిపారు.

- అద్దంకి టౌన్



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి విజయ్‌భాస్కరరావు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చినగంజాం, ఆగస్టు 29 : వర్షకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.విజయ్‌భాస్కరరావు అన్నారు. చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెదగంజాం, కోడూరివారిపాలెం, కాటంవారిపాలెం, సోపిరాల గ్రామాల్లో జ్వరాలు వ్యాప్తి చెందకుండా నిర్మూలన కార్యక్రమం కింద ముందుస్తు జాగ్రత్తలలో భాగంగా గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ జ్వరాలతో బాధ పడే వారు పీహెచ్‌సీకి వచ్చి రక్త పరీక్షలు చేయించుకొని తగు మందులు వాడుకోవాలని సూచించారు. గ్రామాల్లో డెంగ్యూ, మలేరియా, జ్వరాలు ప్రబలకుండా దోమల నియంత్రణపై, పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వలు లేకుండా ఫ్రైడే కార్యక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెదగంజాం గ్రామ సర్పంచ్ నక్కల కృష్ణ, కార్యదర్శి ఎస్‌కే సల్మా, 104 డీఈవో పొదిలి రాఘవ, మహేష్, ఏఎన్ఎంలు నాగుల కోటేశ్వరి, రమాదేవి, సీహెచ్‌వో.ఫాతిమా, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సహజ వ్యవసాయంపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న డీటీసీ, డీఆర్‌సీ విజయనిర్మల

వేటపాలెం(చీరాల), ఆగస్టు 29 : సహజ వ్యవసాయంపై డీటీపీ, డీఆర్‌సీ విజయనిర్మల చెప్పారు. మండల పరిధిలోని పాపాయిపాలెం రైతు సేవా కేంద్రంలో రైతులకు సహజ వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు విత్తనాల ఎంపిక, రసాయన ఎరువుల వాడకం మోతాదు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ రత్నకుమారి, చీరాల ఏడీఏ కె. భాస్కరరావు, వేటపాలెం ఏఓ కాశీవిశ్వనాథ్, ఏపీసీఎన్ఎఫ్ ట్రైనర్ భారతి, ఏఈవోలు గోపీకృష్ణ, ప్రశాంతి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పత్తి పంటలో మెలకువలు పాటించాలి

బల్లికురవ, ఆగస్టు 29 : రైతులంతా పత్తి పంటలో మెలకువలు పాటిస్తే తెగుళ్ల బారి నుంచి తప్పించుకోవచ్చని మండల వ్యవసాయ శాఖ ఏవో కుమారి తెలిపారు. మండలంలోని కొప్పెరపాలెం, సోమవరప్పాడు గ్రామాలలో రైతులు సాగు చేసిన పత్తి పంటను ఏవో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పత్తి పంటలో బెట్ట పరిస్థితుల వలన రసం పీల్చే పురుగు అధికంగా ఉందని దాని నివారణకు రైతులంతా వ్యవసాయ శాఖ సలహాలను తీసుకుని నివారణ చేసుకోవాలని రైతులకు అధికార్లు సూచించారు. అలానే లద్దె పురుగు, మరియు గులాబీ రంగు పురుగు ప్రభావం పంటపై ఉందని అధికార్లు గుర్తించారు. గులాబి రంగు నివారణకు ఎకరాలకు ఆరు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలానే లద్దె పురుగు నిశ్శారణకు ఎకరాకు 10 కేజీల తవుడు, ఒక కిలో బెల్లం, లార్విన్ పొడి 300 గ్రాములకు తగిన నీరు కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో వీఏఏలు భాష, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రేపు కౌన్సిల్ అత్యవసర సమావేశం

చీరాల, ఆగస్టు 29 : మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్లో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన జరుగుతుందని కమీషనర్ చక్రవర్తి గురువారం తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా తెలుగుభాష, క్రీడా దినోత్సవాలు

గిడుగు, ధ్యాన్‌చంద్‌కు నివాళి

అద్దంకిటౌన్, ఆగస్టు 29 : వ్యవహార భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు అని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. గ్రాంధిక భాష నుంచి వాడుక భాషలో గ్రంథాలు ఉండాలని, తెలుగు వ్యవహార భాష కోసం గిడుగు ఉద్యమించారని గుర్తు చేశారు. మండలంలోని మైలవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. విద్యార్థులతో పరమానందయ్య శిష్యులు నాటికను ప్రదర్శించి అందరినీ అకట్టుకున్నారు. విద్యార్థులకు వక్తృత్వం, పద్యాలు, పొడుపు కథలు, గేయాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో హెచ్ఎం పద్మావతి అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవ వేడుకలను నిర్వహించా రు. 8, 9, 10 తరగతి విద్యార్థులకు జ్యోతి చంద్రమౌళి రాసిన 200 తెలుగు వ్యాకరణ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు వీరయ్య, కార్యదర్శి మురళి సుధాకరరావు పాల్గొన్నారు. అద్దంకిలోని సత్రం బడిలో ఎంఈవో సుధాకరరావు, హెచ్ఎం రామారావు, ఉపాధ్యాయులు, తిమ్మాయపాలెం జడ్పీహెచ్‌ఎస్‌లో హెచ్‌ఎం గంగాధరరావు, ఎన్టీఆర్ కాలనీలో ఎంపీయూపీ స్కూల్‌లో హెచ్‌ఎం అంజమ్మ కేఆర్‌కే డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్. వీ మోహనరా వు అధ్యాపకులు అనిత గిడుగు, ధ్యాన్‌చంద్‌కు చిత్రపటాలకు నివాళులర్పించారు. సృజన అధ్వర్యంలో గిడుగు జయంతిని నిర్వహించారు.

చీరాలటౌన్ : తెలుగుభాష గొప్పతనాన్ని నేటి త రం ఎలుగెత్తి చాటాలని మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి కోరారు. గిడుగు జయంతిని మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈసందర్భంగా తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మార్టూరు : చదువుతో పాటు క్రీడలపట్ల విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని, తద్వారా జీవితంలో పోరాటపటిమ పెరుగుతుందని స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎం.శేషగిరిరావు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని మార్టూరు, వలపర్ల జడ్పీ హైస్కూల్స్‌లో ప్రత్యేక క్రీడా కార్యక్రమాలను నిర్వహించారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మక్కెన వీర రాఘవులు సమకూర్చిన క్రీడా పతకాలను శేషగిరిరావు విద్యార్థుల మెడలో వేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రూత్ మెర్సీజాయ్,పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా వలపర్ల జడ్పీ హైస్కూల్లో పీఈటీ దేవరాజ్ ఆధ్వర్యంలో బాలికలకు క్రీడా టీ షర్టులను పంపిణీ చేశారు.

పర్చూరు : తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, విద్యా సంస్థల్లో ఘనంగా నిర్వహించారు. తొలుత రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉప్పుటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హెచ్‌ఎం వసుంధరాదేవి ఆధ్వర్యంలో, శ్రీ శాతవాహనలో విద్యార్థులకు తెలుగు భాషా ఔన్నత్యాన్ని కరస్పాండెంట్ తేళ్ల రాము వివరించారు. అనంతరం శతక పద్యంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.

చినగంజాం : పలు పాఠశాలల్లో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. కడవకుదురు, పెదగంజాం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు హెచ్‌ఎంలు పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు.

ఇంకొల్లు : తెలుగు మధురమైన భాష సీఐ రమణయ్య అన్నారు. ఆదర్శ హైస్కూల్‌లో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ విజయభాస్కర్, టీచర్లు పాల్గొన్నారు.

చినగంజాం : పలు పాఠశాలల్లో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. కడవకుదురు, పెదగంజాం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పంగులూరు : జూనియర్ కళాశాలలో గురువారం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా పీడీ, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



మైలవరం జెడ్పీహెచ్‌ఎస్‌లో పరమానందయ్య శిష్యుల వేషధారణలో విద్యార్థులు



తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

మాతృభాషను మరువద్దు

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 29 : మాతృభాష తల్లి వంటిదని, దానిని ఎప్పటికీ మరువరాదని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. తెగులు భాషా దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలోని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం రోటరీ కమ్యూనిటీ హాలులో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిడుగు వెంకట రామ్మూర్తి చరిత్రను మననం చేశారు. కార్యక్రమంలో యువనేత గౌరీ అమర్‌నాథ్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు రూ.1.50లక్షల విరాళం

వాకర్స్ అసోసియేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్యకు అసోసియేషన్ ప్రతినిధులు రూ.1.50లక్షల విలువైన చెక్కులను అన్న క్యాంటీన్‌కు విరాళంగా అందజేశామని అసోసియేషన్ ప్రెసిడెంట్ పోలుదాసు రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తెలుగు టీచర్లను సన్మానిస్తున్న సహచరులు



బాలికలకు బహుమతులు అందజేసిన స్టేషన్ హౌస్ ఆఫీసర్

కొత్త కరెంట్ స్తంభాలతో ఇబ్బందే

మేదరమెట్ల, ఆగస్టు 29 : మేదరమెట్లలో కొత్తగా వేస్తున్న కరెంట్ స్తంభాల వలన భవిష్యత్‌లో ఇబ్బందులు ఏర్పడుతాయని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. పాత గుంటూరు రోడ్డు నుంచి పాత చెక్ పోస్టు వరకు కొత్తగా వేస్తున్న స్తంభాలు సిమెంట్ రోడ్డుకు దగ్గరలో వేస్తున్నారు. అర్‌అండ్‌బీ రోడ్డు హద్దులో ఉన్న సైడ్ కాలువ పక్కగా విద్యుత్ స్తంభాలు వేస్తే భవిష్యత్‌లో ఇబ్బంది ఉండదు. సిమెంట్ రోడ్డుకు - కాలువకు మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో పాత స్తంభాల కన్నా ఇంకా సిమెంట్ రోడ్డుకు దగ్గరలోనే కొత్త స్తంభాలు వేస్తున్నారు. గతంలో ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఉన్న ఆక్రమణలు సైడు కాలువ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.6 కోట్లు నిధులు మంజూరయ్యాయి. భవిష్యత్‌లో ఈ రోడ్డు నిర్మాణ సమయంలో ఈ స్తంభాలు తొలగించాల్సి ఉంటుంది. మేదరమెట్లలోని రావినూతల రోడ్డులో సిమెంట్ రోడ్డుకు పక్కగానే స్తంభాలను ఏర్పాటు చేశారు. వాహనదారులకు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే విద్యుత్ స్తంభాలను ఢీకొనే పరిస్థితి ఉంది. ఏదైనా భారీ వాహనాలు ఎదురెదురు పడినప్పుడు పక్కకు జరిగే సమయంలో ఈ స్తంభాలు అడ్డం అవుతాయి. విద్యుత్ శాఖ అధికారులు ముందు చూపు లేకుండా స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్తంభాలు సైడు కాలువ పక్కకు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పక్కనే పాతుతున్న విద్యుత్ స్తంభాలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మేదరమెట్ల, ఆగస్టు 29 : మేదరమెట్లలో విద్యుత్ శాఖకు సంబంధించి నూతనంగ చేపట్టిన పనుల వలన విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ షైలా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేదరమెట్లలోని రావినూతల రోడ్డులో విద్యుత్ సరఫర ఉండదని ఆయన తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

